

www.vibharenews.com

# విభారె
తెలుగు దినపత్రిక
VIBHARE TELUGU DAILY

PUBLISHED FROM KURNOOL | ఎడిటర్ : ఆవుల విజయ భాస్కర రెడ్డి | శనివారం 15 మే 2021 | సంపుటి : 02 | సంచిక :303 | పేజీలు : 4 | వెల : రూ 3-00


### ఈ బోనంగిలో హైపోక్లోరిడ్ ద్రావణం పిచికారి

విశాఖపట్నం పరవాడ మండలంలో గల ఈ బోనంగి పంచాయతీలో శుక్రవారం ఎన్ టి పి సి వారి సహకారంతో సర్పంచ్ బోద్ధపు శ్రీనివాస్ గ్రామమంతా హైపోక్లోరైడ్ ద్రావణం పిచికారి చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మనం నివసించే ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని అలాగే సామాజిక దూరం పాటించి అందరూ మాస్కులు ధరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి మల్లికార్జున రావు, పరవాడ టిడిపి జెడ్పిటిసి అభ్యర్థి అట్టా సన్యాసిఅప్పారావు. మంత్రి గిరి ప్రసాద్. వార్డు మెంబర్లు. ఉప సర్పంచ్ మేడంశెట్టి వెంకట సత్యవతి. వెంకట్రావు. చందక యమున. చంద్ర కృష్ణ. చందక మురళీకృష్ణ. మంత్రి చంద్రిక. చందక గోవిందరాజులు. మంత్రి సన్యాసినాయుడు. ఆరిపాక శ్రీను. మతురితి శ్రీనివాసరావు. బోద్ధపు తాత అప్పారావు. దాము రోతునర్సింగ్ రావు తదితరులు పాల్గొన్నారు.

# మీ బాధ.. నన్నూ అంతే వేధిస్తోంది!


## ప్రజల కొవిడ్ కష్టాలపై ప్రధాని ఆవేదన



దిల్లీ: కరోనా కల్లోలంతో ప్రజలు పడుతున్న పాట్లు తనను అంతే ఆవేదనకు గురి చేస్తున్నాయని శుక్రవారం ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. ప్రస్తుతం ప్రపంచమంతా కనిపించని శత్రువుతో పోరాడుతోందని ఆయన అభివర్ణించారు. వేగంగా మార్పులు చెందే ఈ వైరస్ ప్రపంచానికి సవాలుగా పరిణమించదని ఆందోళన వ్యక్తం చేశారు. పీఎం కిసాన్ సమ్మాన్ కింద రైతులకు పెట్టుబడి సాయాన్ని విడుదల చేసిన సందర్భంగా..ప్రధాని ఈ వ్యాఖ్యలు చేశారు.cఈ కరోనా మహమ్మారి కారణంగా మనం ఆత్మీయులను కోల్పోయాం. మీరు అనుభవిస్తోన్న బాధ.. నన్నూ అంతే వేదనకు గురిచేస్తోంది. నేను మీ ప్రధాన సేవకుడిని. మీ ప్రతి ఉద్వేగాన్ని నేను పంచుకుంటాను. మన ముందు కనిపించని శత్రువు ఉంది. 100 ఏళ్లలో ఎన్నడూ లేని కఠిన సమయాన్ని మనం ఇప్పుడు ఎదుర్కొంటున్నాం. ఈ మహమ్మారి ప్రపంచాన్ని అడుగడుగునా పరీక్షిస్తోంది‌c అని ప్రధాని ఈ సందర్భంగా వ్యాఖ్యానించారు.యుద్ధ ప్రాతిపదికన ప్రజలకు వనరులను సమకూర్చేందుకు ప్రభుత్వం కృషి ,చేస్తోందని మోదీ అన్నారు. సాధ్యమైనంత ఎక్కువ మందికి టీకాలు అందించడమే తమ లక్ష్యమని తెలిపారు. cఇప్పటివరకు దాదాపు 18 కోట్ల మందికి టీకాలు అందించాం. దేశవ్యాప్తంగా అన్ని ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఉచితంగా టీకాలు అందిస్తున్నాం. మీ వంతు వచ్చినప్పుడు టీకా తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నాను. వైరస్ వల్ల కలిగే తీవ్ర ప్రభావాల నుంచి ఇది రక్షణ తొడుగులా పనిచేస్తుంది. టీకా తీసుకున్న తరవాత కూడా మాస్కులు ధరించడం మానొద్దు. భౌతిక దూరాన్ని మరవద్దు. కరోనాపై జరిపే పోరాటంలో మనం విజయం సాధిస్తాంc అని ఆయన ప్రజలకు సూచించారు.cరెండోదశలో భారత్‌లో కరోనా మహమ్మారి ఉగ్రరూపం దాల్చింది. వైరస్ వెలుగుచూసిన దగ్గరి నుంచి అనేక జన్యుమార్పులకు లోనైంది. భారత్‌లో రెండో దశ కల్లోలానికి ఆ మార్పులే కారణమని నిపుణులు చెప్తున్నారు. ఇక్కడ నిత్యం లక్షల్లో కొత్త కేసులు వెలుగుచూస్తున్నాయి. అత్యధికంగా ఒక్కరోజులో నాలుగువేల మంది మరణిస్తున్నారు. దాంతో పలు రాష్ట్రాలు ఆంక్షలవైపు మొగ్గుచూపాయి. కొన్ని నగరాల్లో పరిస్థితి అదుపులోకి వస్తున్నట్లే కనిపిస్తున్నా..తాజాగా గ్రామీణ ప్రాంతాలు కరోనా కాటుకు గురవుతున్నాయి. ఈ సమయంలో గ్రామ పంచాయతీలు కీలక పాత్ర పోషించాలిc అని ప్రధాని అన్నారు.

# ఏపీలో కొత్తగా 22,018 కరోనా కేసులు

అమరావతి: గత 24 గంటల్లో ఆంధ్రప్రదేశ్‌లో 89,087 మందికి కరోనా పరీక్షలు నిర్వహించగా 22,018 మందికి కరోనా పాజిటివ్‌గా నిర్ధారణ అయ్యింది. ఇప్పటివరకు రాష్ట్రంలో 13,88,803 మందికి కరోనా వైరస్ సోకింది. నిన్న ఒక్కరోజే కరోనా బారిన పడి 96 మంది మృత్యువాతపడ్డారు. దీంతో మొత్తం మరణాల సంఖ్య 9,173కు





చేరింది. గడిచిన 24 గంటల్లో 19,177 మంది కోవిడ్ నుంచి కోలుకుని క్షేమంగా డిశ్చార్జ్ అవ్వగా, ఇప్పటివరకు 11 లక్షల 72 వేల 948 మంది డిశ్చార్జ్ అయ్యారు. ఈ మేరకు రాష్ట్ర వైద్యారోగ్య శాఖ శుక్రవారం కరోనాపై హెల్త్ బులెటిన్ విడుదల చేసింది. ఏపీలో ప్రస్తుతం 2,03,787 యాక్టివ్ కేసులు ఉన్నాయి. రాష్ట్రంలో నేటి వరకు 1,77,91,220 కరోనా నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు.

# కోవిడ్ కేర్ సెంటర్‌ను ప్రారంభించిన మంత్రి ఆళ్ల నాని



విశాఖపట్నం: శీలానగర్‌లో కోవిడ్ కేర్ సెంటర్‌ను వైద్య ఆరోగ్య శాఖ మంత్రి ఆళ్ల నాని శుక్రవారం ప్రారంభించారు. సీఎం వైఎస్ జగన్ ఆదేశాలతో 300 ఆక్సిజన్ బెడ్లు కలిగిన కోవిడ్ కేర్ సెంటర్‌ను ఎంపీ విజయసాయిరెడ్డి ఏర్పాటు చేశారు. ప్రగతి భారత్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటైన ఆసుపత్రి ప్రారంభోత్సవ కార్యక్రమంలో మంత్రులు కురసాల కన్నబాబు, అవంతి శ్రీనివాస్, ఎంపీ విజయసాయిరెడ్డి పాల్గొన్నారు. 30 మంది వైద్యులు, 90 మంది నర్సులతో ప్రైవేట్ ఆస్పత్రులకు దీటుగా కోవిడ్ కేర్ సెంటర్ ఏర్పాటు చేశారని మంత్రి ఆళ్ల నాని అన్నారు. ప్రగతి భారత్ ట్రస్ట్ ఆధ్వర్యంలో గొప్ప కార్యక్రమం అని అభినందించారు. ప్రస్తుత పరిస్థితిలో ఆక్సిజన్ అవసరం చాలా ఉందని.. ఆక్సిజన్ సరఫరాకి సంబంధించి పూర్తి జాగ్రత్తలు తీసుకుంటున్నారన్నారు. ఆస్పత్రుల్లో జాగ్రత్తలు తీసుకుంటే ఎలాంటి ప్రమాదాలు జరగవన్నారు. ప్రతి బెడ్‌కు ఒక్కో సిలిండర్ ఏర్పాటు చేస్తున్నామని పేర్కొన్నారు. కోవిడ్ కేర్ సెంటర్..ఈ సందర్భంగా ఎంపీ విజయసాయిరెడ్డి మాట్లాడుతూ, ఎంత ఖర్చైనా వెనుకాడకుండా ప్రభుత్వం వైద్యం అందిస్తోందని.. అత్యున్నత ప్రమాణాలతో వైద్య సదుపాయాలు కల్పిస్తోందన్నారు. ఆక్సిజన్ వైఫల్యం వల్ల కోవిడ్ బాధితులు ఇబ్బంది పడకూడదన్నదే లక్ష్యమని ఆయన పేర్కొన్నారు. ప్రగతి భారత్ ట్రస్ట్ ఆధ్వర్యంలో కోవిడ్ బాధితులకు పౌష్టికాహారం అందిస్తామని తెలిపారు. కోవిడ్ కేర్ సెంటర్‌లో పేషెంట్ల అటెండెన్స్ డిస్‌ప్లే బోర్డు ఏర్పాటు చేశామన్నారు. కోవిడ్ కేర్ సెంటర్‌లో అన్ని రక్షణ చర్యలు ఏర్పాటు చేశామని ఎంపీ విజయసాయిరెడ్డి అన్నారు.

# అంబులెన్స్‌లను ఆపే హక్కు ఎవరిచ్చారు?: హైకోర్టు



హైదరాబాద్: రాష్ట్ర సరిహద్దుల్లో అంబులెన్స్‌ల నిలిపివేతపై తెలంగాణ హైకోర్టు అసహనం వ్యక్తం చేసింది. తెలంగాణకు వచ్చే అంబులెన్స్‌లను ఆపే హక్కు ఎవరిచ్చారంటూ రాష్ట్ర ప్రభుత్వంపై మండిపడింది. రాష్ట్రప్రభుత్వ మార్గదర్శకాలపై స్టే విధిస్తూ మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. తదుపరి ఉత్తర్వులు ఇచ్చే వరకు ఆదేశాలు అమల్లో ఉంటాయని స్పష్టం చేసింది. అంబులెన్స్‌లు నియంత్రించేలా రాష్ట్ర ప్రభుత్వం ఎలాంటి ఉత్తర్వులు ఇవ్వరాదని, అంబులెన్స్‌లను అడ్డుకునేందుకు మరో రూపంలో ప్రయత్నించవద్దని తెలిపింది. ఆస్పత్రుల్లో చేరేందుకు కంట్రోల్‌రూమ్ అనుమతి అక్కర్లేదని స్పష్టం చేసింది. ప్రజలు కోరుకుంటే కంట్రోల్ రూమ్‌కు ఫోన్ చేయవచ్చని, ఫోన్ చేసిన వారికి కంట్రోల్‌రూమ్ సహకరించాలని ఆదేశించింది. రెండు వారాల్లోగా కౌంటర్లు దాఖలు చేయాలని కోరుతూ తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కేంద్రానికి హైకోర్టు నోటీసులు జారీ చేసింది. తదుపరి విచారణను జూన్ 17వ తేదీకి వాయిదా వేసింది.హైదరాబాద్‌కు వస్తున్న అంబులెన్స్‌లను సరిహద్దుల్లో నిలిపివేస్తున్నారంటూ విశ్రాంత ఐఆర్ఎస్ అధికారి వెంకట క్రిష్ణారావు దాఖలు చేసిన హౌస్‌మోషన్ పిటిషన్‌పై ఉన్నత న్యాయస్థానం విచారణ చేపట్టింది. ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ హిమా కోహ్లి నేతృత్వంలోని ధర్మాసనం విచారించింది. అంబులెన్స్‌లు ఆపడాన్ని చట్టవిరుద్ధంగా ప్రకటించాలని పిటిషనర్ కోరారు. రాష్ట్రంలోకి అంబులెన్స్‌లను అనుమతించేలా ఆదేశాలివ్వాలని కోరారు. దీనిపై ప్రభుత్వం తరఫున ఏజీ ప్రసాద్ వాదనలు వినిపించారు. నాలుగు రాష్ట్రాల నుంచి హైదరాబాద్‌కు కరోనా బాధితులు వస్తున్నారని కోర్టుకు తెలిపారు. ఏపీ, ఛత్తీస్‌గఢ్, కర్ణాటక, మహారాష్ట్ర నుంచి రోగుల తాకిడి ఎక్కువైందన్నారు. ఆస్పత్రి ముందస్తు అనుమతి ఉన్నవారికి చికిత్స నిరాకరించడం లేదని కోర్టుకు తెలిపారు.ccపడకలు అందుబాటులో లేక బాధితులు ఇబ్బంది పడుతున్నారు. తెలంగాణ ప్రజల ప్రయోజనాల కోసమే ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. ఆస్పత్రిలో పడకలు ఉంటేనే ఇతర రాష్ట్రాల రోగులు తెలంగాణకు రావాలని ఇంతకు ముందే చెప్పాం. దిల్లీ లాంటి రాష్ట్రాలు కూడా ఆంక్షలు విధించాయి.cc అని ఏజీ కోర్టుకు తెలిపారు. దీనిపై స్పందించిన న్యాయస్థానం అంబులెన్స్‌లను ఏ రాష్ట్రం ఆపలేదని తెలిపింది. కారణం ఏదైనా అంబులెన్స్‌లను ఆపే హక్కు ఎవరిచ్చారని ప్రశ్నించింది. ఇది రాజ్యాంగం, చట్టాలు, హైకోర్టు ఆదేశాల ఉల్లంఘన కాదా? అని మండిపడింది. రాజ్యాంగం అన్ని రాష్ట్రాల ప్రజలకు జీవించే హక్కు కల్పించిందని గుర్తు చేసింది. జాతీయ రహదారులపై రాకపోకలు నియంత్రించే అధికారం రాష్ట్రానికి ఎక్కడిదని ప్రశ్నించింది. ఇలా చేస్తే జాతీయ రహదారుల చట్టాన్ని కూడా ఉల్లంఘించినట్లే అవుతుందని తెలిపింది.తెలంగాణలోని ఇతర జిల్లాల నుంచి హైదరాబాద్ వస్తున్నవారు పడకలు ముందుగా రిజర్వ్ చేసుకుంటున్నారా? అని హైకోర్టు ప్రభుత్వాన్ని ప్రశ్నించింది.

# తెలంగాణ సరిహద్దులో ఏపీ అంబులెన్స్‌ల నిలిపివేత

## అంబులెన్స్‌ల నిలిపివేతతో కోవిడ్ పేషెంట్ల ఇబ్బందులు

సూర్యాపేట: తెలంగాణ సరిహద్దులో ఏపీ అంబులెన్స్‌లను తెలంగాణ పోలీసులు నిలిపివేస్తున్నారు. అంబులెన్స్‌లను వెనక్కి పంపడంతో కోవిడ్ పేషెంట్లు ఇబ్బందులు



పడుతున్నారు. ఆసుపత్రి లెటర్, కోవిడ్ కంట్రోల్ రూమ్ నుంచి జారీ చేసిన పాస్‌లు ఉంటేనే అనుమతి ఇస్తున్నారు.కర్నూలు: పంచలింగాల టోల్‌గేట్ తెలంగాణ సరిహద్దు వద్ద ఏపీ అంబులెన్స్‌లపై ఆంక్షలు కొనసాగుతున్నాయి. అంబులెన్స్ అపివేయటంతో చికిత్స అందక ఒకరు మృతి చెందారు. ఆర్టీఏ బోర్డర్ వద్ద మరికొన్ని అంబులెన్స్‌లు నిలిచిపోయాయి. ఈ నేపథ్యంలో తెలంగాణ పోలీసు అధికారులతో ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్ మాట్లాడారు. అంబులెన్స్‌లను పంపించేందుకు అధికారులతో కూడా ఎమ్మెల్యే చర్చలు జరిపారు. దీంతో అంబులెన్స్‌ను అనుమతించారు.కాగా, పొరుగు రాష్ట్రాల నుంచి కోవిడ్-19 వైద్య సేవల కోసం తెలంగాణకు వస్తున్నవారిని అనుమతించే విషయంలో తెలంగాణ ప్రభుత్వం స్పష్టత ఇచ్చింది. రాష్ట్రంలోని ఆస్పత్రుల్లో చికిత్స పొందేందుకు రావాలంటే సదరు ఆస్పత్రి అంగీకారం తప్పనిసరిగా ఉండాలని తెలిపింది. చికిత్స చేసేందుకు సానుకూలంగా ఉన్నట్టుగా ఆస్పత్రితో ముందస్తు ఒప్పందం చేసుకోవాలని పేర్కొంది. అనంతరం పోలీసు శాఖ అనుమతి కోసం కంట్రోల్ రూమ్‌కు వివరాలు సమర్పించి రసీదు తీసుకోవాలని సూచించింది.

# సరిహద్దుల్లో అంబులెన్స్‌లను నిలిపేయడం దురదృష్టకరం: సజ్జల

## మానవతా దృక్పధంతో అంబులెన్స్‌లను అనుమతించాలి

## సజ్జల రామకృష్ణారెడ్డి

అమరావతి: తెలంగాణ సరిహద్దుల్లో ఏపీ అంబులెన్స్‌లను నిలిపేయడం దురదృష్టకరమని ప్రభుత్వ సలహాదారు, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సజ్జల రామకృష్ణారెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ, అంబులెన్స్‌లు ఆపొద్దని తెలంగాణ హైకోర్టు స్పష్టం చేసిందని పేర్కొన్నారు. ఇది జాతీయ విపత్తు.. దీనిపై సుప్రీంకోర్టు కూడా విచారణ చేస్తోందన్నారు. మానవతా దృక్పథంతో అంబులెన్స్‌లను అనుమతించాలని ఆయన కోరారు. తెలంగాణ హైకోర్టు చెప్పినా ఆ రాష్ట్ర ప్రభుత్వం సాంకేతికంగా గైడ్‌లైన్స్ పెట్టడం సరికాదన్నారు.ఆస్పత్రి లెటర్, పాస్‌లు తీసుకురావడం సాధ్యం కాదని తెలిపారు.‘‘మెడికల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఎక్కువగా ఉన్న నగరాలకు వెళ్లడం సహజం. గత



ప్రభుత్వం రాష్ట్రంలో మౌలిక వసతులు అభివృద్ధి చేయలేదు. ఎక్కడా రాని సమస్య తెలంగాణ సరిహద్దుల్లోనే వస్తుంది. ఇది మానవత్వంతో చూడాల్సిన అంశం. తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాలు మాకు ఇబ్బంది కలిగించడం లేదు. హైదరాబాద్ 2024 వరకు ఉమ్మడి రాజధానిగా ఉండాల్సింది. బాబు రాష్ట్రానికి వచ్చేయడంతో మేం ఆ అవకాశాన్ని కోల్పోయాం. అంబులెన్స్‌ల అంశంపై తెలంగాణ ప్రభుత్వంతో చర్చిస్తున్నాం. తెలంగాణ ప్రభుత్వం మానవత్వంతో ఆలోచించాలనివవ సజ్జల రామకృష్ణారెడ్డి విజ్ఞప్తి చేశారు.

# తమిళనాడు సీఎంని చూసి జగన్ నేర్చుకోవాలి: అచ్చెన్న




అమరావతి: ఏపీ సీఎం జగన్మోహన్ రెడ్డిపై తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. శుక్రవారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ రాష్ట్రంలో కరోనా విజృంభిస్తోందని, ఇప్పటికే కరోనా మహమ్మారివల్ల 9, 10 వేల మంది చనిపోతే ముఖ్యమంత్రి ఏం చేశారని ప్రశ్నించారు. ఇంత జరిగినా సీఎం బాధ్యతారహితంగా మాట్లాడుతున్నారని, కరోనాతో సహజీవనం చేయాలని నీతిమాలిన వ్యాఖ్యలు చేస్తున్నారని మండిపడ్డారు. నిన్న వ్యవసాయశాఖ చెక్కుల పంపిణీ కార్యక్రమంలో ముఖ్యమంత్రి మాస్క్ లేకుండా కనిపించారని దుయ్యబట్టారు. ఈ కార్యక్రమంలో ఒక్క జగన్‌కు తప్ప అందరికీ మాస్క్ ఉందని అన్నారు. తమిళనాడులో సినీ పరిశ్రమకు సంబంధించినవారు ముఖ్యమంత్రి స్టాలిన్‌కు చెక్కు ఇవ్వడానికి వెళితే.. సీఎం మాస్క్ పెట్టుకుని బాధ్యతగా వ్యవహరించారన్నారు. స్టాలిన్‌ను చూసి జగన్ నేర్చుకోవాలన్నారు.ఏపీ రాష్ట్రంలో కనీసం పేదలకు భోజనం పెట్టలేని పరిస్థితిలో ప్రభుత్వం ఉందని అచ్చెన్నాయుడు విమర్శించారు.

# 20న అసెంబ్లీ, మండలి సమావేశాలు

## నోటిఫికేషన్ జారీ చేసిన గవర్నర్

అమరావతి: పూర్తి స్థాయి రాష్ట్ర బడ్జెట్ ప్రవేశపెట్టేందుకు ఈ నెల 20వ తేదీన అసెంబ్లీతో పాటు శాసన మండలి సమావేశం కానుంది. ఈ మేరకు గవర్నర్ విశ్వ భూషణ్ హరిచందన్ గురువారం నోటిఫికేషన్ జారీ చేశారు. ఆ రోజు ఉదయం 9 గంటలకు రెండు చోట్లా సమావేశం ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. కోవిడ్-19 ఉధృతి, వ్యాక్సినేషన్ నేపథ్యంలో ఈ సమావేశాలను ఒక రోజుకే పరిమితం చేయాలా? లేదా మరి కొన్ని రోజులు నిర్వహించాలా అనే విషయంపై శాసన సభా వ్యవహారాల సలహా కమిటీ సమావేశంలో నిర్ణయం తీసుకోనున్నారు.

# రఘురామ కృష్ణంరాజు అరెస్ట్..

హైదరాబాద్, మే 14, ప్రభుత్వ ప్రతిష్ఠకు భంగం కలిగించేలా వ్యాఖ్యలు చేశారన్న ఆరోపణలతో నర్సాపురం ఎంపీ, వైసీపీ నేత రఘురామకృష్ణ రాజును ఏపీ సీఐడీ పోలీసులు 124 ఐపీసీ-ఏ సెక్షన్ కింద నాన్ బెయిలబుల్ కేసులో అరెస్ట్ చేశారు. నివేదికల ప్రకారం 30 మంది సీఐడీ అధికారులు 10 కార్లలో రఘురామకృష్ణ రాజును అరెస్ట్ చేయడానికి హైదరాబాద్‌లోని అతని నివాసానికి వెళ్లగా వారిని సీఆర్పీఎఫ్ పోలీసులు అడ్డగించారుఐతే తమ ఉన్నతాధికారుల పర్మిషన్ ఉంటేనే అదుపులోకి తీసుకునేందుకు తాము అంగీకరిస్తామని సీఆర్పీఎఫ్ పోలీసులు కరాఖండిగా తేల్చిచెప్పారు కానీ సీఐడీ పోలీసులు వారిని పక్కకి నెట్టేసి బలవంతంగా రఘురామకృష్ణ రాజును కారులోకి ఎక్కించి అక్కడి నుంచి స్టేషన్ కి తరలించారు. ఐతే తనని అన్యాయంగా అరెస్టు చేస్తున్నారని రఘురామకృష్ణ ఈ సందర్భంగా ఆవేదన వ్యక్తం చేశారు.

# సంపాదకీయం

శనివారం 15 మే 2021

## కోర్టు ఆదేశాలు ఖాతరు చేయరు....ప్రాణాలు పోతున్నా పట్టించుకోరు

కోవిడ్ కల్లోలంలో తమకు నచ్చినట్లు వ్యవహరిస్తున్న ప్రభుత్వాలను న్యాయస్థానాలు ఉతికి ఆరేస్తున్నాయి. ఒకే ఒక విషయంపై ప్రభుత్వాలు ఇంతగా ఇబ్బంది పడిన ఘట్టాలు గతంలో ఎన్నడూ లేవు. ఇదేదో ఆషామాషీ సంగతి అయితే ప్రభుత్వాలు దులిపేసుకుని ఉండేవి. కానీ ప్రజల ముందు పరువు పోతోంది. న్యాయస్థానాలు చేస్తున్న వ్యాఖ్యలు భవిష్యత్తులో ప్రజా న్యాయస్థానమైన ఎన్నికల్లో ప్రభావితం చూపుతాయేమోననేదే వాటి బెంగ. అదే ప్రభుత్వాలను ఉలికి పడేలా చేస్తోంది. అటు ఢిల్లీ నుంచి ఇటు తెలంగాణ వరకూ సుప్రీం కోర్టు నుంచి హైకోర్టుల వరకూ ఒకటే చీవాట్లు. ప్రభుత్వాల నిష్క్రియా పరత్వం ప్రజల ప్రాణాలు తీస్తున్నదని న్యాయస్థానాలు చెప్పకనే చెబుతున్నాయి. సకాలంలో సరైన రీతిలో ప్రభుత్వాలు స్పందించడం లేదు. కరోనా కట్టడి చర్యలూ అంతంతమా?త్రమేనని న్యాయస్థానాలు ఘాటుగానే వ్యాఖ్యానిస్తున్నాయి. ప్రభుత్వాలు ఉదాసీనంగా ఉండే కొద్దీ ప్రజల్లో మరింతగా పలచనై పోతున్నాయి. పైపెచ్చు కోర్టులు తీర్పులతో సంబంధం లేకుండానే విచారణలో భాగంగా చేస్తున్న వ్యాఖ్యలు కలకలం సృష్టిస్తున్నాయి. అవే ప్రజల్లో పెద్ద చర్చకు దారితీస్తున్నాయి. అఫిడవిట్లు, డెడ్ లైన్లు, ప్రత్యేక కమిటీలు ఎన్ని విధాలుగా వీలైతే అంతగానూ న్యాయస్థానాలు ప్రయత్నిస్తున్నాయి. అయినప్పటికీ దున్నపోతు మీద వాన కురిసిన చందాన్నే తలపిస్తున్నాయి ప్రభుత్వాలు. ఆక్సిజన్ సరఫరా మొదలు కోవిడ్ వాక్సిన్ల ధరలు, సరఫరా తీరు వరకూ అన్నిటినీ సుప్రీం కోర్టు తప్పు పడుతోంది. కనీసం కామన్ సెన్స్ తో కేంద్ర ప్రభుత్వం వ్యవహరించలేదని స్పష్టంగానే చెబుతోంది. దీనికి కేంద్రం ఉక్కిరిబిక్కిరవుతోంది. తప్పును అంగీకరించి దిద్దుబాటు చర్యలు తీసుకోవచ్చు. కానీ తాజాగా సర్వోన్నత న్యాయస్థానానికి ఇచ్చిన అఫిడవిట్ కేంద్ర ప్రభుత్వ అహంకార పూరిత వైఖరినే తేటతెల్లం చేసింది. కోవిడ్ విషయంలో శాస్త్రీయంగా తాము చర్యలు తీసుకుంటున్నామని న్యాయస్థానాలు జోక్యం చేసుకోకూడదంటూ కేంద్రం అఫిడవిట్ దాఖలు చేసింది. ఒకవేళ కోర్టులు జోక్యం చేసుకుంటే పర్యవసానాలు తీవ్ర పరిణామాలకు దారి తీస్తాయంటూ అఫిడవిట్ లోనే కేంద్రం ప్రస్తావించింది. లేఖ రాసిన తీరు, అందులోని తీవ్రతను బట్టి చూస్తే మీరు జోక్యం చేసుకోకూడదని తెగేసి చెప్పేసింది. అంతేకాకుండా అంతర్లీనంగా మీకేం సంబంధమంటూ న్యాయస్థానానికే పరిధులు, పరిమితులు గీసినట్లు ఉందని న్యాయ నిపుణులు పేర్కొంటున్నారు. కేంద్ర ప్రభుత్వ అసహనానికి ఈ అఫిడవిట్ అద్దం పడుతోంది. న్యాయస్థానాల సమీక్షల వల్లనే యంత్రాంగం కొంతమేరకు బాధ్యత తీసుకుంటోంది. లేకపోతే ఇప్పటికే అధిక సంఖ్యలో ప్రజలు దిక్కూమొక్కూలేకుండా పడిపోయేవారు. రాష్ట్రాలు ఆ తాను ముక్కలే. న్యాయస్థానాలకు తప్పుడు లెక్కలు చూపించడం, ఇచ్చిన హామీలను అటక ఎక్కించడం చేస్తున్నాయి. అప్పటికప్పుడు ఏదో ఒకటి చెప్పి న్యాయస్థానాలను మభ్యపెట్టాలని చూస్తున్నాయి ప్రభుత్వాలు. తెలంగాణ ప్రభుత్వం ఈవిషయంలో హైకోర్టు నుంచి తీవ్రమైన నిరసననే ఎదుర్కొంది. కోర్టు ధిక్కార చర్యలు తీసుకోవాల్సి వస్తుందంటూ హెచ్చరించవలసిన పరిస్థితి ఏర్పడింది. ప్రత్యేకించి లాక్ డౌన్ వంటి విషయాల్లో మతపరమైన పండుగలను దృష్టిలో పెట్టుకుని వాయిదా వేస్తున్నారా? అంటూ న్యాయస్థానం ప్రశ్నించడం పతాకస్థాయి సన్నివేశంగా చెప్పాలి. అంతటి తీవ్రమైన వ్యాఖ్యలు ప్రత్యేకంగా ప్రత్యర్థి పార్టీల నుంచి ఎదురవుతాయి. కానీ ఉన్నత న్యాయస్థానమే ఎక్కుపెట్టిందంటే ఆలోచించాల్సిందే. ప్రభుత్వానికి అంతకంటే అవమానం మరొకటి ఉండదు. టెస్టుల సంఖ్యను పెంచడం ద్వారా రోగ తీవ్రతను కనిపెట్టవచ్చు. కానీ వాటిని కుదించడం వల్ల వ్యాధి ఎంత వేగంగా వ్యాపిస్తుందో తెలియని అయోమయ పరిస్థితిని ప్రభుత్వం కల్పించింది. అంతా బాగానే ఉందన్న భావన కల్పించేందుకు కేసీఆర్ సర్కారు వేసిన ఎత్తుగడ ఇది. న్యాయస్థానం తీవ్రంగా అభిశంసిస్తున్నప్పటికీ తన లెక్కలే తాను చూపిస్తోంది. మరోవైపు హైదరాబాద్ వంటి వైద్య మౌలిక వసతులున్న నగరంలోనే ప్రాణాలు గాలిలో కలిసిపోతున్నాయి. నిజానికి ప్రజారోగ్యం విషయంలో ఎప్పటికప్పుడు చర్యలు తీసుకోవడం ప్రభుత్వాల బాధ్యత. ప్రాణాలను కాపాడటానికి ఎంతవరకైనా వెళ్లాలి. ఎన్ని వేల కోట్ల రూపాయలు అయినా ఖర్చు పెట్టాలి. కర్నూలు, హైదరాబాద్ వంటి నగరాల్లో ఆక్సిజన్ సరఫరా లేక చూస్తుండగానే ప్రాణాలు పోవడమంటే ప్రభుత్వ హత్యలుగానే పరిగణించాలి. అందుకే తప్పని సరి పరిస్థితుల్లోనే న్యాయస్థానాలు కలగచేసుకుంటున్నాయి. ఈ న్యాయ క్రియాశీలత్వాన్ని చూసి ప్రభుత్వాలు తట్టుకోలేకపోతున్నాయి. కోర్టులకు అధికారమే లేదన్నట్లుగా తమ వాదనలు వినిపిస్తున్నాయి. జీవించే హక్కు ప్రాథమిక హక్కు. దానికి పూచీకత్తు నివ్వడం న్యాయస్థానాల బాధ్యత. అందుకే నిర్లజ్జగా, బాధ్యతారాహిత్యంగా ప్రభుత్వాలు వ్యవహరించినా న్యాయస్థానాలు తమ వంతు కర్తవ్యాన్ని నిర్వహిస్తున్నాయి. అయినప్పటికీ వాటికి కొన్ని పరిమితులుంటాయి. ప్రభుత్వాలను ములుగర్రతో పొడవటమే తప్ప పని చేయించడం న్యాయస్థానాలకు కూడా సాధ్యం కావడం లేదు. ఇప్పుడు న్యాయస్థానాల జోక్యం నుంచి తప్పించుకునేందుకు ప్రభుత్వాలు సాకులు వెదుకుతున్నాయి.

# ఆయనే ప్లస్..ఆయనే మైనస్

గుంటూరు, మే 14, (న్యూస్ పల్స్)నాడు ఒక సినీ నటుడు ఎన్టీయార్ తెలుగుదేశం పార్టీకి నాదెండ్ల భాస్కర రావు కో పైలెట్ రూపంలో పెట్టిన ఇబ్బందులు అన్నీ ఇన్నీ కావు. చివరికి పార్టీకి వెన్నుపోటు పొడిచి పెద్ద దెబ్బే కొట్టేశారు. అలాగే జరుగుతుంది అని కాదు కానీ ఆయన కుమారుడు అయిన జూనియర్ నాదెండ్ల ఇపుడు జనసేనలో మొత్తం చక్రం తిప్పుతున్నారు. పైగా ఆయన కమ్మ సామాజికవర్గానికి చెందిన వారు. మాకూ ఒక పార్టీ అని కాపులు ఉనికిని చాటుకునే విధంగా జనసేన ఉండాలనుకుంటున్నారు. ఇక జనసేన పార్టీలో కీలక స్థానాల్లో ఉన్న వారిలో మెజారిటీ నాయకులు కాపులే. కానీ వారందరి గొంతూ ఎక్కడా వినిపించడంలేదు. ఒక్క నాదెండ్ల మనోహర్ మాత్రమే అన్నింటా వినిపిస్తున్నారు, కనిపిస్తున్నారు అన్న విమర్శలు అయితే పవన్ చెవి దాకా వచ్చాయట.సీనియర్ రాజకీయ నేత. కాపు నాయకుడు మాదాసు గంగాధరం జనసేన విడిచి పోతూ పోతూ పవన్ కి రాసిన ఒక లేఖ పవన్ లో కదలిక తెచ్చిందని అంటున్నారు. పవన్ కి పార్టీలో ఏం జరుగుతుందో అన్నది కూడా అర్థమవుతోంది అంటున్నారు. తాను సినిమాలో బిజీగా ఉంటూ సీనియర్ కదా అని నాదెండ్ల మనోహర్ కి పెద్ద పీట వేస్తే అదే చివరికి పార్టీలో తీవ్ర అసంతృప్తికి దారితీస్తోందని కూడా పవన్ భావిస్తున్నారుట. మొత్తానికి నాదెండ్ల మనోహర్ కు, పార్టీ నాయకుల మధ్యన పెను అగాధమే ఏర్పడింది అన్నది పవన్ కూడా గ్రహించారు అంటున్నారు.ఇక పవన్ పార్టీ మీద దృష్టి పెడుతున్నారు అన్న వార్తలు వస్తున్నాయి. నాదెండ్ల మనోహర్ విషయంలో ఇప్పటికీ పవన్ కి మంచి అభిప్రాయమే ఉంది. అయితే పార్టీ నేతలు ఆయన విషయంలో కొంత అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు అన్న దాని మీదనే ఆయన ఆలోచిస్తున్నారు అంటున్నారు. దాంతో పార్టీ ముఖ్యులు అందరితో కూర్చుని నాదెండ్ల మనోహర్ ప్రాబ్లంని త్వరలో సెటిల్ చేస్తారు అంటున్నారు. నాదెండ్ల వంటి సీనియర్ నేత పార్టీకి అండగా ఉండడం వల్ల కలిగే లాభాలను కూడా నేతలను పవన్ వివరిస్తారు అంటున్నారు. అదే సమయంలో పార్టీలో ఒకరి వల్ల మరొకరి అవకాశాలు ఎపుడూ తగ్గిపోవు అన్న మాట కూడా ఆయన చెప్పి నేతలకు భరోసా కలిగిస్తారుట. ఇక జనసేనను వచ్చే ఎన్నికల నాటికి సిద్ధం చేయడానికి కూడా పవన్ తగిన కార్యాచరణను రెడీ చేస్తున్నారు అంటున్నారు. పార్టీలో నెలకొన్న స్తబ్దతను తొలగించడంతో పాటు నాదెండ్ల మనోహర్ తో పాటు పనిచేసే ఇతర నేతలకు కూడా కీలకమైన బాధ్యతలను అపగించాలని యోచిస్తున్నారుట. దాంతో జనసేన నుంచి కొత్త ముఖాలు కూడా ఇక పైన తమ గొంతు బలంగా వినిపించే చాన్స్ వస్తుంది అంటున్నారు. అదే సమయంలో సామాజిక సమీకరణల సమతూల్యత దెబ్బ తినకుండా కూడా పవన్ పార్టీలో కీలక చర్యలను తీసుకుంటారు అన్నది ప్రచారం అవుతోంది. మొత్తానికి నాదెండ్ల మనోహర్ పార్టీకి గుదిబండగా మారారు అని పోతున్న నేతలు బండ వేస్తూంటే ఆయన పార్టీకి అండా దండా అని పవన్ చెప్పబోతున్నారా అన్నదే జనసైనికుల మధ్య చర్చగా ఉందిట.

# రెండింటికి చెడ్డ రేవడిలా కిశోర్ చంద్రదేవ్

విజయనగరం, మే 14, (న్యూస్ పల్స్)మాజీ కేంద్ర మంత్రి కిశోర్ చంద్రదేవ్ రాజకీయాలకు ఫుల్ స్టాప్ పెట్టినట్లే. ఆయన ఢిల్లీలోనే కాలం గడుపుతున్నారు. ఇటు వైపు కూడా రావడం లేదు. తనను ఆదరించిన పార్టీ కాంగ్రెస్, చివరి నిమిషంలో తనకు టిక్కెట్ ఇచ్చిన టీడీపీ రెండూ ఇబ్బందుల్లో ఉండటంతో కిశోర్ చంద్రదేవ్ రాజకీయంగా సైలెంట్ అయ్యారంటున్నారు. తన వారసురాలిగా శృతిదేవ్ ను చూడాలన్నది ఆయన ఆశ. అందుకే వచ్చే ఎన్నికల్లో తాను పోటీ చేయబోవడం లేదని కిశోర్ చంద్రదేవ్ ఇటీవల టీడీపీ అధిష్టానానికి చెప్పినట్లు తెలిసింది.కిశోర్ చంద్రదేవ్ సీనియర్ రాజకీయ నేత. రాజకీయాల్లో రాజుగానే ఆయన ఒక వెలుగు వెలిగారు. విజయనగరం జిల్లాలో రద్దయిన పార్వతీపురం లోక్ సభ నియోజకవర్గం నుంచి నాలుగు సార్లు పార్లమెంటు సభ్యుడిగా ఎన్నికయ్యారు. అరకు నియోజకవర్గానికి ఒకసారి ఎంపీ అయ్యారు. మరోసారి రాజ్యసభ పదవిని కూడా పొందారు. అయితే ఇవన్నీ కాంగ్రెస్ హయాంలో జరిగినవే. కాంగ్రెస్ పార్టీ కేంద్ర మంత్రి పదవి కూడా కిశోర్ చంద్రదేవ్ కు ఇచ్చింది.అత్యంత నమ్మకమైన నేతగా ఉంటాడనుకుంటే 2019 ఎన్నికలకు ముందు కిశోర్ చంద్రదేవ్ టీడీపీలోకి అనూహ్యంగా వచ్చారు. ఏపీలో కాంగ్రెస్ కోలుకోలేదని భావించి ఈ నిర్ణయం తీసుకున్నారు. 2011 నుంచి 2014వరకూ గిరిజన సంక్షేమ శాఖ మంత్రిగా కిశోర్ చంద్రదేవ్ పనిచేసినా గిరిజన కుటుంబాలకు ఆయన చేసిందేమీ లేదు. దాని ఫలితమే మొన్నటి ఎన్నికల్లో రుచి చూడాల్సి వచ్చింది. అయితే తన కుమార్తె శృతి దేవ్ ను మాత్రం కాంగ్రెస్ లోనే ఉంచారు.వచ్చే ఎన్నికల్లో శృతి దేవ్ ను అరకు నియోజకవర్గం నుంచి ఎంపీగా పోటీ చేయించాలని కిశోర్ చంద్రదేవ్ భావిస్తున్నారు.

అయితే కాంగ్రెస్ ఇక భవిష?యత్ లో కోలుకోలేదు. టీడీపీపైనే కొంత ఆశలున్నా అది కూడా ప్రస్తుత పరిస్థితుల్లో కష్టమేనని భావిస్తున్నారు. ఈ పరిస్థితుల్లో శృతి దేవ్ ను వైసీపీలోకి పంపేందుకు కిశోర్ చంద్రదేవ్ ప్రయత్నిస్తున్నారన్న టాక్ వినపడుతుంది. గతంలో శృతి దేవ్ కు వైసీపీ ఆఫర్ ఇచ్చినా వద్దనుకున్నారు. ఈసారి స్వయంగా వీరే వైసీపీ లోకి వెళ్లాలని భావిస్తున్నారు. కిశోర్ చంద్రదేవ్ మాత్రం రాజకీయాలకు గుడ్ బై చెప్పి కుమార్తెను వైసీపీలోకి పంపాలన్నది ప్రయత్నం. మరి దీనికి వైసీపీ అధిష్టానం అంగీకరిస్తుందా? లేదా? అన్నది చూడాల్సి ఉంది.

# వ్యాక్సిన్ పాలిటిక్స్ కు చెక్ ఎప్పుడు

విజయవాడ, మే 14, (న్యూస్ పల్స్)చంద్రబాబు విపక్షంలోకి చేరి రెండేళ్ళ అవుతోంది. ఆయన పార్టీకి జనాలు ఇచ్చింది 23 మంది ఎమ్మెల్యేలు అయితే ఎందరు ఇపుడు పార్టీలో యాక్టివ్ గా ఉన్నారో కూడా తెలియదు. అయినా సరే చంద్రబాబు టాక్ ఆఫ్ ది స్టేట్ అవుతున్నారు. 151 సీట్లతో అధికారంలోకి వచ్చిన జగన్ సర్కార్ మీద ఎప్పటికపుడు పై చేయి సాధించేందుకు కూడా చంద్రబాబు చూస్తున్నారు. ఇదిలా ఉంటే ఏపీలో వ్యాక్సిన్ కొరత బాగా ఉంది. ఆయా రాష్ట్రాలకు ఫార్మా కంపెనీలకు మధ్య లింక్ పెట్టేసింది కేంద్రం. దాంతో ఇపుడు చాలా రాష్ట్రాలు కిందా మీదా అవుతున్నాయి. ఇక ఏపీలో తీరు చూస్తే వ్యాక్సిన్ల మీద పెద్ద రాజకీయ సమరమే సాగుతోంది.ఇలా దీర్ఘాలు తీస్తున్నారు తమ్ముళ్లు. మా నాయకుడు ఈ టైమ్ లో సీఎం గా ఉంటే కచ్చితంగా ఈపాటికి ప్రతీ ఒక్కరికీ వ్యాక్సిన్లు వేయించేసేవారు అంటున్నారు. మరి అది సాధ్యమా. దేశంలో అంతటా వ్యాక్సిన్ల కొరత ఉంటే ఏపీలో ఎలా సాధ్యమవుతుంది అంటే అక్కడే ఉంది కథ అంటున్నారు. హైదరాబాద్ భారత్ బయోటిక్ కంపెనీ తో చంద్రబాబుకు మంచి స్నేహ బాంధవ్యాలు ఉన్నాయట. బాబు లాంటి గండరగండడు సీఎం గా ఈ టైమ్ లో ఉంటే ఆయన్ని కాదని మోడీ దగ్గరకు కూడా భారత్ బయోటిక్ వ్యాక్సిన్లు వెళ్ళేవి కాదు అని అంటున్నారు.ఏపీలో పెద్ద ఎత్తున వ్యాక్సిన్ల అవసరం ఉంది. ఏడు కోట్ల డోసులు కావాలంటే 73 లక్షలు మాత్రమే ఇప్పటికి ఇచ్చారని జగన్ కేంద్రానికి రాసిన లేఖలో పేర్కొన్నారు. మరి ఇలాగైతే ఎపుడు వ్యాక్సిన్లు పూర్తిగా దక్కేనూ. అయితే టీడీపీ నేతల మాటలను ఇన్నాళ్లకు వైసీపీ నేతలు కూడా ఒప్పుకున్నట్లే ఉన్నారు. చంద్రబాబుకు అంతగా పలుకుబడి ఉంటే ఆయనే వ్యాక్సిన్లు ఇప్పించేలా చూడండి అంటున్నారు ఆరోగ్య మంత్రి ఆళ్ళ నాని. భారత్ బయోటిక్ పెద్దలతో బంధుత్వాన్ని కూడా చంద్రబాబు వాడి అయినా ఏపీకి వ్యాక్సిన్లు ఇప్పించాలని కూడా కోరుతున్నారు. ఇది పైకి అంటున్నా బాబు వల్లనే తెలుగు రాష్ట్రాలలో తయారవుతున్న వ్యాక్సిన్ ఏపీకి పెద్దగా రావడంలేదని, ఇదే రాజకీయమని కూడా వైసీపీ నేతలు పరోక్షంగా అనేస్తున్నారుట.భారత్ బయోటిక్ పెద్దలతో చంద్రబాబుకు ఎంతటి సన్నిహిత పరిచయాలు ఉన్నాయో ఎవరికీ తెలియదు కానీ వ్యాక్సిన విషయంలో మాత్రం బాబు తలచుకుంటే పని అవుతుంది అని ప్రభుత్వ పెద్దలే చెబుతున్నారు అంటే నిజంగా చంద్రబాబు గ్రేట్ అనాల్సిందే. బాబుకు ఏ పదవీ లేదు, ఆయన వరసగా ఎన్నికల్లో ఓడుతున్న ఒక పార్టీ అధినేత. అయినా సరే చంద్రబాబుకు 1600 కోట్లు ఇస్తామని వ్యాక్సిన్లు తెచ్చిపెట్టమని ఒక మంత్రి గారు అంటే మీ పలుకుబడి ఉపయోగించి వ్యాక్సిన్లు ఇప్పించండి అని మరో మంత్రి అంటున్నారు. సరే ఎక్కడ వ్యాక్సిన్లు తయారైనా కూడా వాటిని దేశాన అంతటా సరఫరా చేయాలి. మరి చంద్రబాబు ఉంటే ఆయన పలుకుబడితో ఏపీకి ఈ పాటికి ఎక్కువ మొత్తంలో వ్యాక్సిన్లు వచ్చేవేవో అన్న చర్చ అయితే నగటు జనంలో ఉంది. దానికి బలపరుస్తున్నట్లుగా వైసీపీ నేతల మాటలు కూడా ఉంటున్నాయి. ఇక్కడ ఒక విషయం స్పష్టం చేయాలి. ఎవరు రాజకీయం చేసినా కూడా అంతిమంగా ప్రజల మేలు కోసమే. మరి వ్యాక్సిన్ ఇపుడు ప్రాణాధారం. నిజంగా చంద్రబాబుకు ఆ పలుకుబడి ఉంటే ఏపీకి ఎక్కువగా అవి దక్కేలా చూసి జనంలో భారీ మైలెజ్ ని రాజమార్గాన పొందవచ్చు అన్నదే మేధావుల సూచన.

# కోవిడ్ కేంద్రాల్లో వినోద కార్యక్రమాలు

శ్రీకాకుళం శ్రీకాకుళం జిల్లాలో కోవిడ్ కేర్ కేంద్రాల్లో వినోద కార్యక్రమాలను తాజాగా నిర్వహిస్తున్నారు. జిల్లాలోని పాత్రునివలస కేంద్రంలో 817 మంది కోవిడ్ బాధితులు ఉండటంతో వాళ్లందరికీ వివిధ కార్యక్రమాలను నిర్వహిస్తున్న సంగతి తెలిసిందే ప్రతిరోజు యోగా నిపుణులు డాక్టర్ చిలుక లక్ష్మీ కాంత్ నేతృత్వంలో యోగా కార్యక్రమాలను నిర్వహిస్తుండగా తాజాగా వినోద కార్యక్రమాలు ప్రారంభించారు. జిల్లా జానపద కళారూపాలు - బుర్రకథ కార్యక్రమంతో దీన్ని ప్రారంభించారు. కోవిడ్ కేర్ కేంద్రంలో అన్ని సదుపాయాలు కల్పిస్తూ చక్కటి పర్యవేక్షణ జరుగుతున్న సంగతి అందరికి తెలిసిందే. మంచి వైద్యసేవలు, తాగునీరు, పారిశుద్ధ్యం కల్పిస్తూ మంచి పౌష్టికాహారాన్ని అందించడం జరుగుతోంది. దీంతోపాటుగా వినోద కార్యక్రమాలు ఏర్పాటు చేయడం వలన మానసిక వినోదం పొంది కోవిడ్ అనే భావన నుండి బయటకు వచ్చి దృఢంగా మారగలరు. కోవిడ్ బాధితులు అనే ఆలోచనతో ఉండకుండా వినోద కార్యక్రమాలు ఉపయోగకరంగా ఉన్నాయి. వినోద కార్యక్రమాలుగా నిర్వహిస్తున్న కళాజాత కార్యక్రమంలో చారిత్రక అంశాలతోపాటు సామాజిక, సాంస్కృతిక అంశాలను ప్రస్తావిస్తూ కళా బృందాలు చక్కగా వివరిస్తున్నాయి. కోవిడ్ కూడా సాధారణ జ్వరం వంటిదేనని మనం జాగ్రత్తగా ఉంటే మన దారికి చేరదని వివరించడం జరుగుతోంది. ప్రతి ఒక్కరూ మాస్కు వదల రాదని, భౌతిక దూరం పాటించాలని, చేతులు తరచూ శుభ్రపరచాలని సూచిస్తున్నారు. గత ఏడాది కూడా కళజాత కార్యక్రమాలు నిర్వహించి కోవిడ్ కేర్ కేంద్రంలో కోవిడ్ బాధితులు సాధారణ జీవితం గడిపే విధంగా జిల్లా యంత్రాంగం కృషి చేసింది. ఈ ఏడాది జిల్లా కలెక్టర్ జె నివాస్ ఆదేశాలకు అనుగుణంగా మరల చేపట్టినట్లు నోడల్ అధికారి కె.రవి కుమార్ తెలిపారు. బుధవారం నర్సుల దినోత్సవం కూడా నిర్వహించి పనిచేస్తున్న నర్సులకు మీతో మేమున్నాం అనే భరోసాను కల్పించామని చెప్పారు.

# అంబులెన్స్ డ్రైవర్ గా మారిన సోంపేట ఎమ్మార్వో గురుప్రసాద్

శ్రీకాకుళం శ్రీకాకుళం జిల్లా సోంపేట తహసీల్దార్ చేసిన ఓ పని అందరి మన్ననలు అందుకుంటోంది. ఆయన చేసిన పని ఎంతోమందికి స్ఫూర్తి నింపుతోంది. సోంపేటలోని ఎస్సీ వీధిలో ఒకరి పరిస్థితి విషమంగా మారింది. అయితే రోగి కుటుంబ సభ్యులు ప్రైవేటు వాహనాల్లో తరలించేందుకు ప్రయత్నించి కరోనా భయంతో ఎవరూ ముందుకు రాలేదు. ఊపిరి అందకపోవడంతో భయపడ్డ కుటుంబసభ్యులు ఏం చేయాలో తెలియక వెంటనే తహసీల్దార్‌కు సమాచారమిచ్చారు.ఎమ్మార్వోకు ఫోన్ వచ్చిన వెంటనే ఆయన.. దగ్గర్లో ఉన్న వాహనాల కోసం ప్రయత్నించారు. కానీ ఎవరూ ముందుకు రాలేదు. దీంతో ఉద్దానం ఫౌండేషన్ అంబులెన్స్ వినియోగించేందుకు నిర్ణయించారు. అయితే ఆ అంబులెన్స్ డ్రైవర్ కుటుంబసభ్యుల పరిస్థితి బాగోలేకపోవడంతో విధులకు హాజరు కాలేదు. ఇతర డ్రైవర్లను రిక్వెస్ట్ చేసినా ఎవరూ ముందుకు రాలేదు. దీంతో తహసీల్దానే సాహసం చేశారు. ఆ వ్యక్తిని బతికించాలనే తాపత్రయంతో సోంపేట తహసీల్దార్ ఎస్.గురుప్రసాద్ కొంతసేపు అంబులెన్స్ డ్రైవర్‌గా మారారు. స్వయంగా డ్రైవింగ్ చేస్తూ అంబులెన్స్‌ని ఎస్సీ వీధికి తీసుకెళ్లి బాధితుడిని తీసుకొచ్చేందుకు బయల్దేరారు. అయితే కొంతదూరం వెళ్లిన తరువాత గమనించిన స్థానిక వాలంటీర్ శ్రీకాంత్ డ్రైవింగ్ చేసేందుకు ముందుకు వచ్చాగు. గతంలో అంబులెన్స్ నడిపి అనుభవం ఉండడంతో శ్రీకాంత్ ముందుకు వచ్చారు.దీంతో వెంటనే శ్రీకాంత్ కు పీపీఈ కిట్ సమకూర్చి బాధితుడిని సామాజిక ఆసుపత్రికి తరలించి వైద్యసేవలు అందించారు. కరోనా కష్టకాలంలో ఓ బాధితుడిని ఆసుపత్రికి చేర్చేందుకు సహకరించిన వాలంటీర్ శ్రీకాంత్‌ను, తహసీల్దార్‌ను అధికారులు అభినందించారు.

# టీడీపీలో కనిపించని ఆ ముగ్గురు

విజయవాడ, మే 14, (న్యూస్ పల్స్)టీడీపీ అధికారంలో ఉన్న సమయంలో ప్రభుత్వం తరపున వాయిస్ వినిపించి, అనేక కీలక నిర్ణయాలు తీసుకున్న, ప్రతిపక్షంపై సవాళ్లు రువ్విన ముగ్గురు కీలక నాయకులు ఏమయ్యారు ? ఇప్పుడు ఏం చేస్తున్నారు ? చంద్రబాబుకు అత్యంత విధేయులుగా పేరున్న ఈ ముగ్గురు కూడా.. రాజకీయంగా అంతే వేగంగా చక్రం తిప్పారు. వీరిలో ఒకరు రాష్ట్ర ప్రణాళికా సంఘం మాజీ ఉపాధ్యక్షుడు కుటుంబరావు, రెండు ఏపీ రాజకీయాలపై ఢిల్లీలో గళం వినిపించిన కంభంపాటి రామ్మోహన్‌రావు, మూడు సిఆర్‌డీయే మాజీ ఉపాధ్యక్షుడు, మంత్రి పొంగూరు నారాయణ. గత బాబు హయాంలో నిత్యం మీడియాలో ఉన్న వీరు.. ఇప్పుడు ఎక్కడా కనిపించడం లేదు.కుటుంబరావు విషయానికి వస్తే.. ఆర్థిక శాస్త్రంబాగా తెలిసి, చార్టెడ్ అకౌంటెంట్‌గా పార్టీకి సేవలందించిన నేపథ్యంలో ఆయనకు చంద్రబాబు అనూహ్య పదవి ఇచ్చారు. ఈ క్రమంలో ఆయనను ప్రణాళికా సంఘం అనే దానిని ఏర్పాటు చేసి మరీ.. ఉపాధ్యక్షుడిని చేశారు. అంటే.. కుటుంబరావు కోసం.. కొత్త పదవిని సృష్టించారు. ఐదేళ్లు బాగానే ఉన్నప్పటికీ.. తర్వాత.. ఆయన పార్టీ కోసం అక్కరకు రాలేదు. ఆయన తనపనేదో తాను చేసుకుంటున్నారు. అయితే.. ఇటీవల చంద్రబాబు ఒత్తిడిపై.. ఓటాన్ అకౌంట్ బడ్జెట్ విధానాన్ని తప్పు బడుతు.. ప్రభుత్వంపై ఒకటి రెండు విమర్శలు మాత్రం గుప్పించారు.ఆ తర్వాత మళ్లీ సైలెంట్ అయిపోయారు. ఇక, మాజీ మంత్రి పొంగూరు నారాయణ. చంద్రబాబు కలల రాజధాని అమరావతి బాధ్యతను నెత్తిన ఎత్తుకున్న ఈయన.. సీఆర్ డీయే వైస్ చైర్మన్‌గా కూడా చక్రం తిప్పారు. అయితే.. గత ఎన్నికల్లో పార్టీ తరపున నెల్లూరు సిటీ నుంచి పోటీ చేసి.. ఓడిపోయిన తర్వాత.. సైలెంట్ అయ్యారు. ఇటీవల సీఐడీ కేసులు నమోదు చేయడంతో.. తెరమీదకి వచ్చే అవకాశం ఉందని ప్రచారం జరిగినా.. ఆయన కేవలం.. హైకోర్టులో పిటిషన్ వేసి ఊరుకున్నారు. రాజకీయంగా మాత్రం ఆయన బయటకు రాలేదు.ఇక, కంభంపాటి రామ్మోహన్ రావు. సుదీర్ఘకాలంగా టీడీపీలో ఉన్న నాయకుడిగా ఈయనకు పేరున్నా.. పార్టీ పదవులే తప్ప.. ప్రత్యక్ష పదవులపై ఈయన పెట్టుకున్న ఆశలు ఒక్కటి కూడా నెరవేరలేదని అంటారు. ఈ కారణంగానే ఆయన సైలెంట్ అయిపోయారు. తాజాగా గళం విప్పేందుకు ప్రయత్నిస్తున్నట్టు సమాచారం. కానీ, ఈ ముగ్గురికీ చంద్రబాబు ఎంతో ప్రియార్టీ ఇచ్చారని.. వారు మాత్రం ఆశించిన మేరకు పార్టీకి, చంద్రబాబుకు కూడా ఉపయోగపడడం లేదనే వాదన అయితే.. పార్టీ వర్గాల్లో వినిపిస్తుండడం గమనార్హం.

# కేఈ రాజకీయాలకు గుడ్ బై...?

కర్నూలు, మే 14, (న్యూస్ పల్స్)కేఈ కృష్ణమూర్తి పూర్తిగా రాజకీయాలకు దూరమయినట్లే కన్పిస్తుంది. స్థానిక సంస్థల ఎన్నికల ఫలితాల తర్వాత కేఈ కృష్ణమూర్తి మరింత పార్టీకి దూరమయినట్లే కన్పిస్తుంది. 2019 ఎన్నికలకు ముందే తాను రాజకీయాల నుంచి తప్పుకుంటున్నట్లు ప్రకటించినా డోన్, పత్తికొండ నియోజకవర్గాల్లో తన పట్టు సడలకుండా ఆయన ప్రయత్నాలు చేశారు. కానీ వైసీపీ ప్రభుత్వం దూకుడుతో ఆయన వెనక్కు తగ్గారు. తన కుమారుడి రాజకీయ భవిష్యత్ పై ఆందోళన ఉన్నప్పటికీ టీడీపీ పరిస్థితి ఏమాత్రం బాగా లేకపోవడంతో ఆయన ఆలోచనలో పడినట్లు చెబుతున్నారు.కేఈ కృష్ణమూర్తి బీసీ నేత. తెలుగుదేశం పార్టీలో తొలి నుంచి కీలకంగా ఉన్న నేత. పార్టీ అధికారంలోకి వచ్చిన ప్రతిసారీ కేఈ కుటుంబానికి కేబినెట్ లో బెర్త్ ఖాయం. గత టీడీపీ హయాంలోనూ కేఈ కృష్ణమూర్తి ఉప ముఖ్యమంత్రి గా పనిచేశారు. అయితే అప్పుడు కూడా టీడీపీ నాయకత్వం పట్ల కేఈ కృష్ణమూర్తి సంతృప్తికరంగా లేరు. టీడీపీ లో జరుగుతున్న పరిణామాలు ఆయనను ఇబ్బందికి గురిచేశాయి. తనకు విలువ ఇవ్వడం లేదని గుర్తించిన కేఈ కృష్ణమూర్తి రాజకీయాల నుంచి తప్పుకుంటున్నట్లు ప్రకటించారు.ఇటీవల చంద్రబాబు కేఈ కృష్ణమూర్తి తో ప్రత్యేకంగా మాట్లాడినట్లు తెలిసింది. గత ఎన్నికల్లో బీసీ ఓటు బ్యాంకు టీడీపీకి దూరమయింది. దీంతో ఆయనను మరోసారి పార్టీలో క్రియాశీలకంగా వ్యవహరించాలని కోరినట్లు చెబుతున్నారు. బీసీ సామాజికవర్గానికి చెందిన అచ్చెన్నాయుడును రాష్ట్ర పార్టీ అధ్యక్షుడిగా నియమించినా ఫలితం పెద్దగా లేదని చంద్రబాబు భావిస్తున్నారు. అందుకే కేఈ కృష్ణమూర్తి ని తిరిగి యాక్టివ్ చేయాలని నిర్ణయించుకున్నారు.కానీ కేఈ కృష్ణమూర్తి చంద్రబాబు ప్రతిపాదనను సున్నితంగా తిరస్కరించినట్లు తెలిసింది. తాను ప్రస్తుత పరిస్థితుల్లో ప్రత్యక్ష రాజకీయాల్లోకి రాలేనని చెప్పినట్లు తెలిసింది. తన కుమారుడు, సోదరుల సేవలను వినియోగించుకోవాలని సూచించినట్లు చెబుతున్నారు. బీసీ ఓటు బ్యాంకు తిరిగి పొందేందుకు చేయాల్సిన పనులను ఈ సందర్భంగా కేఈ కృష్ణమూర్తి చంద్రబాబుకు సూచించినట్లు చెబుతున్నారు. మొత్తం మీద కేఈ కృష్ణమూర్తి తాను ఇక రాజకీయాల జోలికి రానని తేల్చి చెప్పినట్లు తెలిసింది.

# పరవాడ, వాడచీపురుపల్లి పి హెచ్ సి లో కరోనా వ్యాక్సిన్ సెంటర్ కొనసాగించాలి

విశాఖపట్నం పరవాడ వాడచీపురుపల్లి పి హెచ్ సి లో కరోనా వ్యాక్సిన్ సెంటర్ ఎత్తివేయడం అన్యాయం అని గనిశెట్టి సత్యనారాయణ అన్నారు. వెంటనే పరవాడ వాడచీపురుపల్లి పీహెచ్సీల్లో కరోనా వ్యాక్సిన్ వేయాలని సిఐటియు జిల్లా కార్యదర్శి గని శెట్టి సత్యనారాయణ సిఐటియు మండల ఉపాధ్యక్షులు గేదెల అప్పారావు పరవాడ స్టాఫ్ నర్స్ వైద్య సిబ్బందికి శుక్రవారం మెమోరండం అందజేశారు. ఈ సందర్భంగా గని శెట్టి మాట్లాడుతూ ఎన్ టి పి సి, ఫార్మా సిటీ లో 40 వేల మంది పని చేస్తున్నారని అలాగే మండలంలో ప్రజలు కరోనా వ్యాక్సిన్ కోసం అచ్చుతాపురం గాజువాక ప్రభుత్వ ఆస్పత్రికి వెళ్లి అక్కడ కరోనా వ్యాక్సిన్ పొందమని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. మొదట డోస్ ఇక్కడ ఇచ్చి 2వ డోస్ మరో దగ్గరికి వెళ్ళమని చెప్పడం మంచిది కాదన్నారు. లక్షలమంది ప్రజలు ఉన్న వద్ద కేంద్రాలను ఎత్తివేయడం మంచిది కాదన్నారు ప్రభుత్వం వెంటనే పరవాడ మండలానికి వ్యాక్సిన్ వస్తున్నప్పుడు ప్రతిసారి మండలంలో ఉన్న 2 పీహెచ్సీల్లో వ్యాక్సిన్ వేయాలని డిమాండ్ చేశారు కనీసం వ్యాక్సిన్ కేంద్రాలను కూడా మండలంలో ఏర్పాటు చేయకుండా ఉన్న కేంద్రాలను తొలగిస్తూ ఉంటే ప్రభుత్వం లో ఉన్న పెద్దలు ఏం చేస్తున్నారని అని ప్రశ్నించారు. వెంటనే కేంద్రాలను కొనసాగించాలని గని శెట్టి డిమాండ్ చేశారు.


## రెవెన్యూ సేవలు అందక ప్రజలు నానా అవస్థలు

విశాఖపట్నం పరవాడ మండలంలో రెవెన్యూ సేవలు అందక ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. పరవాడ తహసీల్దార్ ను కరోనా నిమిత్తం నగరములో గల ప్రథమ హాస్పిటల్ లో ప్రత్యేక విధులు నిర్వహిస్తుండగా మండలంలో ప్రజలు మాత్రం కుల ధ్రువీకరణ పత్రాలకు నెలలు గడుస్తున్నా తహశీల్దార్ సంతకం అందుబాటులో లేకపోవడంతో సర్టిఫికెట్లు నిలిచిపోయాయని పలువురు గగ్గోలు పెడుతున్నారు. అత్యవసర మై ఏదైనా కుల దృవీకరణ, ఇతర సర్టిఫికెట్ల కొరకు మీ సేవ ద్వారా జారీ చేసుకున్న సకాలంలో ప్రజలకు అందటం లేదని పలువురు విమర్శలు కురిపిస్తున్నారు.

# రెండేళ్లు...నేతలు సేమ్ టూ సేమ్

విజయవాడ, మే 14, (న్యూస్ పల్స్)ప్రజాస్వామ్యానికి అధికార విపక్షాలు రెండు కళ్ళు. అయితే ప్రభుత్వం అంటే కేవలం అధికార పార్టీయే అని తలపండిన చంద్రబాబు అనుకున్నారు, అహంకరించారు. అంతా నా ఇష్టం అన్న తీరునే అనాడు రాజ్యం చేశారు. ఆయన బాటలోనే జగన్ కూడా సర్కార్ ని నడుపుతున్నారు. నాడు 67 మంది ఎమ్మెల్యేలు గెలిచి కూడా జగన్ బాబు స్పీడుకు ఎక్కడా బ్రేకులు వేయలేకపోయారు. ఇపుడు కేవలం 23 మంది ఎమ్మెల్యేలతో చంద్రబాబూ చేసేది లేదు. ఇద్దరిదీ ఒక్కటే ఆలోచన. విపక్షం గొంతు పెగలకూడదు. తమ అధికార రథానికి ఎక్కడా అడ్డూ అదుపూ ఉండకూడదు. అయితే దాని వల్ల ఎన్నో విపరిణామాలు సంభవిస్తున్నాయని మేధావులు మొత్తుకున్నా ఫలితం మాత్రం లేకుండా పోతోంది.ప్రజాస్వామ్యంలో ప్రతిపక్షానికి ఎంతో విలువ ఉంది. బాధ్యత కూడా ఉంది. అధికార పక్షం తప్పులు చేస్తే సరిదిద్దడం, నిర్మాణాత్మకమైన సూచనలు చేయడం విపక్షం గురుతర బాధ్యత. అయితే ఆ విషయంలో గత పదేళ్ళుగా ఏపీ రాజకీయాల్లో చాలా తేడాలు వచ్చేశాయి. విపక్షం అంటే ప్రతీ దాన్ని పూర్తిగా వ్యతిరేకించడమే అన్నట్లుగా కథ నడిపారు. నాడు చంద్రబాబు సీఎం గా ఉన్నపుడు జగన్ కూడా ప్రతీ దానికీ విమర్శలు చేసేవారు. ఇక నాటి సర్కార్ కూడా కొన్ని మంచి పనులు చేసింది. వాటిని కనీసంగా కూడా మెచ్చుకోకుండా చిన్న తప్పు జరిగినా పట్టుకుని అగ్గి మీద గుగ్గిలం అయ్యేవారు. దాని వల్ల విపక్షాన్ని బాబు అసలు ఖాతరు చేయడం మానేశారు.బాబు అసలే ఆవలించకుండానే పేగులు లెక్కబెట్టే రకం. అందువల్ల ఆయన ఊరుకుంటారా. జగన్ రెండేళ్ళ పాలన మీద చంద్రబాబు ఘాటుగా విమర్శలు చేస్తున్నారు కానీ ఏ ఒక్క దాన్ని మెచ్చుకోరు. అలాగే లాజిక్ లేని విమర్శలు కూడా టీడీపీ చేసిన వాటిలో ఉంటున్నాయి. గద్దెనెక్కారుగా, కొండ మీద కోతిని అయినా తీసుకురండి అంటూ బాబు సహా తమ్ముళ్ళు గద్దిస్తున్నారు. ఇలా ప్రతీ దానికీ నానాయాగీ చేస్తూంటే వైసీపీకి మండిపోతోంది. కానీ బాబు ఆగుతారా. ఆయన వైసీపీ నేర్పిన విద్యనే వారి మీద ప్రయోగిస్తున్నారు. పైగా కేంద్రంలోని బీజేపీని పక్కన పెట్టి ఏపీ సర్కార్ ని కార్నర్ చేస్తున్నారు. ఈ పరిణామాలతో బిత్తర పోతున్న వైసీపీ పెద్దలు బాణాలు వేయడం ఆపండి మహాప్రభో అంటున్నారు. ఆపద కాలంలో కూడా రాజకీయమేనా అని కూడా ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.నిర్మాణాత్మకమైన విపక్షంగా విమర్శలు చేయాలి మంత్రి అనిల్ కుమార్ యాదవ్ బాబుని కోరుతున్నారు. మీరు సలహాలు ఇవ్వండి మేము స్వీకరిస్తామని అని కూడా అంటున్నారు. అయితే ఏపీలో టీడీపీ వైసీపీ రాజకీయ యుద్ధం చాలా దూరం వెళ్ళిపోయింది. ఇక అధికార విపక్షాల మధ్య సామరస్యం అన్నది కూడా లేకుండా పోతోంది. ఈ పరిస్థితులలో చంద్రబాబు తీరు మార్చుకోమని కోరినా ఉపయోగం ఉంటుందా. పైగా గత అయిదేళ్ళూ మీరేం చేశారు అని టీడీపీ నుంచి ఎదురు ప్రశ్న వస్తోంది. అంటే ప్రతిపక్షం పాత్ర ఏంటి అన్నది నాడూ సరిగ్గా అర్ధం చేసుకోలేదు. నేడూ అదే జరుగుతోంది. ఫలితంగా సమస్య కంటే సమరమే ధాటీగా దూసుకువస్తోంది. మొత్తానికి ఇప్పటికైనా వైసీపీ నుంచి సరైన సూచన విపక్షానికి వెళ్ళింది. మరి ప్రతిపక్షాలు కూడా రాజకీయాలను పక్కన పెట్టి నిర్మాణాత్మకంగా వ్యవహరిస్తే రాష్ట్రంలో పాలన గాడిన పడుతుంది. ప్రజలకు కూడా మేలు జరుగుతుంది.

# మళ్లీ చిరు ధాన్యాలకు ఊతం



నెల్లూరు, మే 14, (న్యూస్ పల్స్)కొర్రలు, వరిగలు, సామలు, రాగులు, సజ్జలు, జొన్నలు.. తదితర చిరుధాన్యాల్లో పోషక విలువలు అధికంగా ఉ ంటాయని శాస్త్రీయంగా నిర్ధారణ అయింది. వీటిలో శరీరానికి అవసరమైన పీచుపదార్థాలు, విటమిన్‌లు, ఖనిజాలు పుష్కలంగా ఉంటాయి. పోషక లోపాలు ఉత్పన్నం కాకుండా ఇవి ఒక కవచంలా పనిచేస్తాయని వైద్యులు చెబుతున్నారు. కొందరు వీటిని స్మార్ట్ ఫుడ్‌గా తీసుకుంటున్నారు. చిరు ధాన్యాల సాగును ప్రభుత్వం ప్రోత్సహిస్తోంది. మద్దతు ధరలను ప్రకటిస్తూ రైతులకు అండగా నిలుస్తోంది. వీటిపై పరిశోధనలు జరిపేందుకు వీలుగా కర్నూలులో చిరుధాన్యాల అభివృద్ధి బోర్డు ఏర్పాటుకు సన్నాహాలు చేస్తోంది. కొర్రలు, అండుకొర్రలు, సామలు, ఊదలు, ఆరికలు, రాగులు.. మైనర్ మిల్లెట్ కిందకు, జొన్న, సజ్జ వంటివి మేజర్ మిల్లెట్ కిందకు వస్తాయి. రాయలసీమలోని మిగిలిన జిల్లాలతో పోలిస్తే కర్నూలులో వీటి సాగు ఎక్కువగా ఉంది. నాలుగేళ్ల క్రితం 25వేల హెక్టార్లలో ఉన్న సాగు నేడు 92 వేల హెక్టార్లకు విస్తరించింది. పెట్టుబడి వ్యయం తక్కువగా ఉండడంతోపాటు చీడపీడలు బెడద లేకుండా దిగుబడి ఆశాజనకంగా వస్తుంది. అన్ని రకాల నేలల్లో వీటిని పండించవచ్చు. దీంతో జిల్లాలోని రైతులు చిరు ధాన్యాల సాగుపై ఆసక్తి చూపుతున్నారు. చిరు ధాన్యాల్లో ఇనుము, కాల్షియం, జింకువంటి పోషకాలు అధికంగా ఉంటాయి. వీటితో చేసిన ఆహారం బరువు తగ్గడానికి తోడ్పడుతుంది.కడుపులో అల్సర్లవంటి సమస్యలు ఉండవు. జీర్ణక్రియ బాగుంటుంది.డయాబెటిస్ తదితర అనేక వ్యాధులు దరి చేరకుండా చేసుకోవచ్చు.రాగులు..శరీరానికి అవసరమైన పోషక పదార్థాలతో పాటు ఎముకలకు కావాల్సినంత కాల్షియాన్ని అందిస్తాయి.చిరుధాన్యాలపై నంద్యాలలోని ఆర్ఏఆర్ఎస్(రీజినల్ అగ్రికల్చర్ రీసెర్చ్ స్టేషన్) శాస్త్రవేత్తలు పలు పరిశోధనలు చేస్తున్నారు. అలాగే 1,600 క్వింటాళ్ల విత్తనాలను కూడా సిద్ధం చేశారు. ఇందులో 1000 క్వింటాళ్ల కొర్రలు ఉన్నాయి. కరోనా నుంచి కాపాడుకునేందుకు ప్రజలు రోగనిరోధక శక్తిని పెంచే ఆహారాన్ని తీసుకుంటున్నారు. ఫాస్ట్‌ఫుడ్‌ను వీడి.. పాత తరం ఆహారపు అలవాట్లపై మక్కువ చూపుతున్నారు. మంచి పోషకాలు లభించే చిరు ధాన్యాలకు ప్రాధాన్యమిస్తున్నారు. ఇంటి వంటను పిల్లలతో పాటు పెద్దలు కూడా ఇష్టంగా తింటున్నారు. దీంతో మార్కెట్లో చిరు ధాన్యాల అమ్మకాలు రెట్టింపు అయ్యాయి. చిరు ధాన్యాలు ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయి. ఈ పంటలు సాగు చేసే రైతులకు నికర ఆదాయం వస్తుంది. కొర్రపై కొన్నేళ్లుగా పరిశోధనలు చేస్తున్నాం. తక్కువ వర్షపాతంలోనూ పంటను పండించేందుకు వీలుగా వంగడాలను రూపొందిస్తున్నామంటున్నారు శాస్త్రవేత్తలు

# గోరంట్ల ఆవేదన దానికొ లెక్కుందా....

రాజమండ్రి, మే 14, (న్యూస్ పల్స్)తెలుగుదేశం పార్టీ సీనియర్ నేత గోరంట్ల బుచ్చయ్య చౌదరి ఆ మధ్య చేసిన వ్యాఖ్యలు పార్టీలో సంచలనం కల్గించాయి. జూనియర్ ఎన్టీఆర్ పార్టీలో యాక్టివ్ కావాలని కోరారు. అంతే కాదు అన్ని కులాలకు ప్రాధాన్యత ఇవ్వాలని గోరంట్ల బుచ్చయ్య చౌదరి డిమాండ్ చేశారు. అయితే అందరూ అనుకున్నట్లు బుచ్చయ్య టార్గెట్ చంద్రబాబు కానే కాదట. ఆయన యనమల రామకృష్ణుడు, అచ్చెన్నాయుడు కుటుంబాలను టార్గెట్ చేసుకుని ఈ వ్యాఖ్యలు చేశారంటున్నారు.తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపక సభ్యుల్లో గోరంట్ల బుచ్చయ్య చౌదరి ఒకరు. ఎన్టీరామారావు ఉన్నప్పుడు ఆయన ఒక వెలుగు వెలిగారు. తర్వాత నుంచి ఆయనను పార్టీలో ఒక నేతగానే చూశారు. తమలో కలుపుకునేందుకు చంద్రబాబు ప్రయత్నించలేదు. దీనికి ప్రధాన కారణం యనమల రామకృష్ణుడు. తనకు మంత్రి పదవి రాకపోవడానికి కారణం కూడా యనమల రామకృష్ణుడేనని తన సన్నిహితుల వద్ద గోరంట్ల బుచ్చయ్య చౌదరి వ్యాఖ్యానించారు.యనమల కారణంగానే తూర్పు గోదావరి జిల్లాలో పార్టీ భ్రష్టుపట్టి పోయిందని కూడా అంతర్గత సంభాషణల్లో ఆయన చెప్పుకొచ్చారు. అందుకే కుటుంబ రాజకీయాలను కూడా పక్కన పెట్టాలని గోరంట్ల బుచ్చయ్య చౌదరి కామెంట్స్ చేశారంటున్నారు. నలభై ఏళ్ల నుంచి కొందరు నేతలు పాతుకు పోవడం వల్ల కొత్త నాయకత్వం ఎదగలేకపోతుందని అనడానికి కూడా కారణం యనమల రామకృష్ణుడిని ఉద్దేశించి అని చెబుతున్నారు.తోడు రాజమండ్రిలో ఆదిరెడ్డి అప్పారావు కుటుంబం పార్టీ ని వీడివెళ్లి వచ్చినా వారికి మళ్లీ పదవులు, బాధ్యతలను అప్పగించడంపై గోరంట్ల బుచ్చయ్య చౌదరి అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. ఆదిరెడ్డి భవానీ ఎమ్మెల్యేగా ఆమె సోదరుడు ఎంపీగా, ఆమె బాబాయి అచ్చెన్నాయుడు టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడిగా అనేక పదవులను ఒకే కుటుంబానికి ఇవ్వడాన్ని కూడా గోరంట్ల బుచ్చయ్య చౌదరి తప్పుపడుతున్నారు. ఇలాగే పాతుకుపోయిన నేతలను అంటిపెట్టుకుని ఉ ంటే పార్టీకి మనుగడ ఉండదని గోరంట్ల బుచ్చయ్య చౌదరి కుండ బద్దలు కొడుతున్నారు. ఆయన యనమల, అచ్చెన్నాయుడులను ఉద్దేశించే ఈ వ్యాఖ్యలు చేశారంటున్నారు.

# కమ్మేస్తున్న కరోనా



న్యూఢిల్లీ, మే 14, (న్యూస్ పల్స్) రోనా సెకండ్ వేవ్ కే భారత్ వణికిపోతుంది. అయితే థర్డ్ వేవ్ ముప్పు కూడా పొంచి ఉందని నిపుణులు చెబుతున్నారు. ప్రజలు అప్రమత్తంగా లేకుంటే థర్డ్ వేవ్ ప్రమాదకరంగా మారే అవకాశం ఉందని హెచ్చరిస్తున్నారు. ప్రస్తుతం దేశ వ్యాప్తంగా కరోనా సెకండ్ వేవ్ తో ప్రజలు అల్లాడి పోతున్నారు. రోజుకు దాదాపు నాలుగు లక్షల మంది కరోనా బారిన పడుతున్నారు. మూడు వేల మంది వరకూ మరణిస్తున్నారు.సెకండ్ వేవ్ నుంచి భారత్ బయటపడటమే కష్టంగా ఉంది. మే నెలాఖరు వరకూ సెకండ్ వేవ్ తీవ్రత ఉంటుందని చెబుతున్నారు.ప్రధానంగా పది రాష్ట్రాల్లో ఈ సెకండ్ వేవ్ తీవ్రంగా ఉంది. కట్టుదిట్టమైన చర్యలు తీసుకున్నప్పటికీ కేసులు ఆగడం లేదు. ఇప్పటికే కరోనా బారిన పడి రెండున్నర లక్షల మంది వరకూ చనిపోయారు. అనేక నగరాల్లో ఆసుపత్రులు కరోనా రోగులతో నిండిపోయాయి. ఆక్సిజన్ ను అందించేందుకు ప్రభుత్వాలు శతవిధాలుగా ప్రయత్నిస్తున్నాయి.ముఖ్యంగా మహారాష్ట్ర, ఉత్తర్ ప్రదేశ్, ఢిల్లీ, కర్ణాటక, కేరళ, చత్తీస్ ఘడ్, పశ్చిమ బెంగాల్, తమిళనాడు, గుజారత్, రాజస్థాన్ లలో ఎక్కువగా కేసులు నమోదవుతున్నాయి. ఇప్పటికే మహారాష్ట్ర, ఢిల్లీ, కర్ణాటక ప్రభుత్వాలు లాక్ డౌన్ ను ప్రకటించాయి. ఉత్తర్ ప్రదేశ్ ప్రభుత్వం వీకెండ్ లాక్ డౌన్ ను ప్రకటించింది. అనేక రాష్ట్రాల్లో నైట్ కర్ఫ్యూను అమలు చేస్తున్నారు. పూర్తి స్థాయి లాక్ డౌన్ పెట్టకపోతే వైద్య సిబ్బంది చేతులెత్తే ప్రమాదముందని నిపుణులు హెచ్చరిస్తున్నారు.సెకండ్ వేవ్ తీవ్రత ఇంత ఎక్కువగా ఉంటుందని కేంద్ర ప్రభుత్వం సయితం ఊహించలేదు. తొలిదశ కరోనా నుంచి తేలిగ్గా బయటపడ్డామని భావించి కంటితుడుపు చర్యలు తీసుకుంది. దీంతో సెకండ్ వేవ్ లో ఫలితం అనుభవించాల్సి వస్తుంది. అందుకే థర్డ్ వేవ్ కు సిద్ధంగా ఉండాలని అన్ని రాష్ట్రాలకు కేంద్ర ప్రభుత్వం ఇప్పటికే ఆదేశాలు జారీచేసింది. ఆక్సిజన్ ఉత్పత్తిని పెంచుకోవడంతో పాటు ఆసుపత్రుల్లో పడకల సామర్థ్యాన్ని కూడా పెంచుకోవాలని ఉత్తర్వులు జారీ చేసింది. ప్రజలు కూడా థర్డ్ వేవ్ కు సిద్ధంగా ఉండాలని పలువురు సూచిస్తున్నారు. థర్డ్ వేవ్ టెన్షన్ కరోనా మొదటి వేవ్ వల్ల 60 ఏళ్లకు పైబడిన వారు ఎక్కువగా ఇబ్బందులు పడ్డ సంగతి తెలిసిందే. అయితే ప్రస్తుతం కరోనా రెండో వేవ్ లో యువత ఎక్కువగా కోవిడ్ బారిన పడుతున్నారు. ఇక మూడో వేవ్‌లో పిల్లలకు ప్రమాదం పొంచి ఉందని, వారికి అప్పుడు ఎక్కువగా కోవిడ్ వ్యాప్తి చెందే అవకాశాలు ఉన్నాయని, అందువల్ల వారి తల్లిదండ్రులకు ఇప్పటి నుంచే టీకాలను వేయించాలని నారాయణ హెల్త్ వ్యవస్థాపక చైర్మన్ డాక్టర్ దేవి శెట్టి అన్నారు.కరోనా మూడో వేవ్ లో పిల్లలు ఎక్కువగా కోవిడ్ బారిన పడే అవకాశ ఉంది కనుక వారి తల్లిదండ్రులకు ఎక్కువగా టీకాలను వేయించాలి. అలాగే దేశంలో 12 ఏళ్ల వయస్సు కన్నా తక్కువగా ఉన్న చిన్నారులు 165 మిలియన్ల మంది ఉ న్నారు, వారిలో కనీసం 20 శాతం మంది కోవిడ్ బారిన పడతారు, 5 శాతం మందికి ఐసీయూలో చికిత్స అందించాల్సి వస్తుంది. కానీ మన దేశంలో 90వేల ఐసీయూ బెడ్స్ పెద్దలకు ఉన్నాయి, పిల్లలకు 2వేల బెడ్స్ మాత్రమే ఉన్నాయని అన్నారు. అందువల్ల వైద్య సదుపాయాలను ఇప్పటి నుంచే ఏర్పాటు చేయాలన్నారు.మన దేశంలో పీడియాట్రిక్ కోవిడ్ కేర్ వార్డులు లేవని, చిన్నపిల్లలకు ఇంటెన్సివ్ కేర్ యూనిట్స్ లేవని, కనుక ఆయా సదుపాయాలను మెరుగు పరచాల్సిన అవసరం ఉందని డాక్టర్ దేవి శెట్టి అన్నారు. అక్టోబర్-డిసెంబర్ నడుమ కోవిడ్ మూడో వేవ్ వచ్చే అవకాశం ఉన్నందున దేశంలో కనీసం 300 మిలియన్ల మంది యువ తల్లిదండ్రులకు టీకాలను వేయాలని, దీంతో పిల్లలను కోవిడ్ నుంచి రక్షించవచ్చని అన్నారు.

# హద్దులు లేని గ్రీన్ ఫౌండేషన్ సేవలకు జోహార్లు

**మాజీ ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్**

నెల్లూరు హద్దులు లేకుండా కోట పట్టణానికి చెందిన గ్రీన్ ఫౌండేషన్ చేస్తున్న సేవలకు జోహార్లు అంటూ గూడూరు మాజీ ఎమ్మెల్యేమాజీ ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్ పేర్కొన్నారు. గురువారం గూడూరు ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి గ్రీన్ ఫౌండేషన్ దాతృత్వంతో సుమారు 7 లక్షల విలువచేసే 30 ఆక్సిజన్ సిలిండర్లు , బ్లౌజులు, మాస్కులు నెబులైజర్ లు స్థానిక ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి హాస్పిటల్ సూపర్నెంట్ రామకృష్ణకు గూడూరు మాజీ ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్ అందజేశారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్ మాట్లాడుతూ గూడూరు ప్రభుత్వ ఏరియా హాస్పిటల్ నందు ఆక్సిజన్ సిలిండర్ కొరతతో కరోనా బాధితులు ఇబ్బందులు పడుతున్నారని ఇలాంటి పరిస్థితుల్లో వారికి సహాయం అందించాలని గూడూరు సబ్-కలెక్టర్ రొనంఖి గోపాల కృష్ణ, ప్రభుత్వ ఏరియా హాస్పిటల్ సూపర్నిడెంట్ రామకృష్ణ పిలుపు మేరకు తాను వెంటనే స్పందించి, మా సోదరులు గ్రీన్ ఫౌండేషన్ చైర్మన్ షేక్ జలీల్ అహ్మద్ తో మాట్లాడినా వెంటనే వారు కూడా స్పందించి వారి దాతృత్వంతో సుమారు 7 లక్షల రుపాయుల విలువ చేసే 30 ఆక్సిజన్ సిలిండర్లు, గ్లౌస్లు ,మాస్కులు,నెబులైజర్ లు ను అందించడం జరిగిందని అన్నారు.గ్రీన్ ఫౌండేషన్ మాతృ సంస్థ అయినటువంటి ఎస్కో (ఎడ్యుకేషనల్ సోషల్ కల్చరల్ ఆర్గనైజేషన్) సంస్థ వారికి ఈ సందర్భంగా ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలితజేస్తున్నాం అన్నారు. గూడూరు నియోజకవర్గం లోని కోట, వాకాడు, చిట్టమూరు మండలాల ప్రజలు కూడా కోట హాస్పిటల్ నందు ఆక్సిజన్ సిలిండర్ అందక ప్రైవేట్ హాస్పిటల్ లో నందు చూపించుకునే పరిస్థితి లేదు కనుక,గ్రీన్ ఫౌండేషన్ వారు తన విన్నపం మేరకు 15 ఆక్సిజన్ సిలిండర్లను కోట ప్రభుత్వ హాస్పిటల్ అందించాలని కోరుతున్నాం అన్నారు.రాబోవు రోజులలో కూడా గ్రీన్ ఫౌండేషన్ సహకారాలు గూడూరు ప్రభుత్వ హాస్పిటల్ అవసరమని కాబట్టి వారు సహకారాలు అందించాలని వెల్లడించారు.ఇటీవల ఏరియా ఆసుపత్రికి రమా చారిటబుల్ ట్రస్ట్ ద్వారా 20 ఆక్సిజన్ సిలిండర్లను అందించడం జరిగింది అని మరలా గ్రీన్ ఫౌండేషన్ ద్వారా 30 సిలిండర్ లను హాస్పిటల్ కు అందించామని తెలిపారు, ఇవి పూర్తిగా ప్రభుత్వం వారికే ఇచేస్తున్నామని అన్నారు.అలాగే రాబోయే రోజులలో కూడా దాతల సహకారంతో మరి కొన్ని సిలిండర్లను ఏర్పాటు చేస్తామని అన్నారు. హాస్పిటల్ నందు ఎమర్జెన్సీ కింద వచ్చిన పేషంట్ లను తీసుకు పోడానికి సరైన స్ట్రైచర్ లు లేవని త్వరలో వాటిని కూడా హాస్పిటల్ వారికి అందిస్తామని అన్నారు.ఈ విపత్కర పరిస్థితులలో ఎంతో మంది దాతలు ముందుకొచ్చి సహకారాలు.అందిస్తున్నారని వారందరికీ ప్రత్యేకంగా ధన్యవాదాలని తెలుపుతున్నానని అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రీన్ ఫౌండేషన్ అధ్యక్షులు షేక్ జలీల్ అహ్మద్, సభ్యులు షాజహాన్, బాబు, కరిముల్లా, మస్తాన్ బాష మరియు గూడూరు పట్టణ యువత వెంకట సాయి తదితరులు తదితరులు పాల్గొన్నారు.

# మన్యంలో పర్యాటక కేంద్రాల మూసివేత?

విశాఖపట్నం మన్యం వ్యాప్తంగా కరోనా సెకండ్ వేవ్ వ్యాప్తి తీవ్రతను దృష్టిలో ఉ ంచుకుని మన్యం వ్యాప్తంగా పర్యాటక కేంద్రాలు మూసివేయాలని పాడేరు ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి వెంకటేశ్వర్ నిర్ణయం తీసుకున్నారు.సాధారణ పరిస్థితులు నెలకొనే వరకు మన్యంలో పర్యటకులు ఎవరు సందర్శించ వద్దని ఒక ప్రకటనలో తెలిపారు.అరకులోయ మండలం పెద్దలబుడు గిరి గ్రామదర్శిని,మండలం కేంద్రంలోని గిరిజన మ్యూజియం,పద్మాపురం ఉద్యానం,డుంబ్రిగుడ మండల కేంద్రంలోని చాపరాయి జలపాతం,జి.మాడుగుల మండలం లోని కొత్తపల్లి జలపాతం,చింతపల్లి మండలంలోని తాజంగి,లంబసింగి,అనంతగిరి మండలం లోని బొర్ర గుహలు,సందర్శనకు వచ్చే పర్యాటకులను అనుమతించవద్దని నిర్వాహకులకు ఆదేశాలు ఇచ్చారు.

## పోలీసులు ఆపివేసారు..ఆసుపత్రి సిబ్బంది నిలిపివేసారు

కర్నూలు కర్నూలు శివారులోని పుల్లూరు టోల్ ప్లాజా వద్ద కర్నూలు నుంచి హైదరాబాద్ వెళ్లే అంబులెన్స్ లను తెలంగాణ పోలీసులు ఆపేశారు. తిరుపతి నుంచి హైదరాబాద్ లోని జీవన్ ఆసుపత్రిలో అబ్దుల్లా అనే వ్యక్తి ని చేర్పించేందుకు భార్య అంబులెన్స్ లో బయలుదేరింది. అయితే పుల్లూర్ టోల్ ప్లాజా వద్ద తెలంగాణ పోలీసులు అడ్డుకున్నారు. హైదరాబాద్ లోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో బెడ్ మాట్లాడుకు న్నాం.. కాళ్లు మొక్కుతామని మహిళ వేడుకున్నా తెలంగాణ పోలీసులు పంపలేదు. పోలీసులు పంపకపోవడంతో కర్నూలు జీజీహెచ్ కు భర్తను అంబులెన్స్ లో మహిళ తీసుకొచ్చింది. అయితే ఆక్సిజన్ బెడ్ లేవని ఆస్పత్రిలో చేర్చుకోలేదని మహిళ చెప్తోంది. అరగంటకు పైగా జీజీహెచ్ వద్ద వేచివున్నా ఆసుపత్రి సిబ్బంది పట్టించుకోవడం లేదని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు

## రోడ్డు ప్రమాదంలో ఇద్దరు పోలీసుల దుర్మరణం

రాజమండ్రి తూర్పు గోదావరి జిల్లా సామర్లకోట ఉండూరు బ్రిడ్జి వద్ద గురువారం అర్ధరాత్రి ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. విజయవాడ నుండి వస్తున్న కోవిడ్ వ్యాక్సిన్ వెహికిల్ కు ఎస్కార్ట్ గా వెళ్లేందుకు బ్రిడ్జి సమీపంలో వేచి ఉన్న ఇద్దరు హైవే పెట్రోలింగ్ పోలీసుల పైకి ఒక లారీ దూసుకెళ్లింది. హెడ్ కానిస్టేబుల్ మెండి సత్యనారాయణ,హోమ్ గార్డు ఎన్. ఎస్.రెడ్డి అక్కడికక్కడే మృతి చెందారు. మృతులు తిమ్మాపురం పీఎస్ లో పనిచేస్తున్నారు. సమాచారం అందిన వెంటనే పోలీసులు అక్కడకు చేరుకుని మృతదేహాలను స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. పోలీసులు ఆపివేసారు..ఆసుపత్రి సిబ్బంది నిలిపివేసారుకర్నూలు కర్నూలు శివారులోని పుల్లూరు టోల్ ప్లాజా వద్ద కర్నూలు నుంచి హైదరాబాద్ వెళ్లే అంబులెన్స్ లను తెలంగాణ పోలీసులు ఆపేశారు. తిరుపతి నుంచి హైదరాబాద్ లోని జీవన్ ఆసుపత్రిలో అబ్దుల్లా అనే వ్యక్తి ని చేర్పించేందుకు భార్య అంబులెన్స్ లో బయలుదేరింది. అయితే పుల్లూర్ టోల్ ప్లాజా వద్ద తెలంగాణ పోలీసులు అడ్డుకున్నారు. హైదరాబాద్ లోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో బెడ్ మాట్లాడుకు న్నాం.. కాళ్లు మొక్కుతామని మహిళ వేడుకున్నా తెలంగాణ పోలీసులు పంపలేదు. పోలీసులు పంపకపోవడంతో కర్నూలు జీజీహెచ్ కు భర్తను అంబులెన్స్ లో మహిళ తీసుకొచ్చింది. అయితే ఆక్సిజన్ బెడ్ లేవని ఆస్పత్రిలో చేర్చుకోలేదని మహిళ చెప్తోంది. అరగంటకు పైగా జీజీహెచ్ వద్ద వేచివున్నా ఆసుపత్రి సిబ్బంది పట్టించుకోవడం లేదని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు

## రోడ్డు ప్రమాదంలో ఇద్దరు పోలీసుల దుర్మరణం

రాజమండ్రి తూర్పు గోదావరి జిల్లా సామర్లకోట ఉండూరు బ్రిడ్జి వద్ద గురువారం అర్ధరాత్రి ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. విజయవాడ నుండి వస్తున్న కోవిడ్ వ్యాక్సిన్ వెహికిల్ కు ఎస్కార్ట్ గా వెళ్లేందుకు బ్రిడ్జి సమీపంలో వేచి ఉన్న ఇద్దరు హైవే పెట్రోలింగ్ పోలీసుల పైకి ఒక లారీ దూసుకెళ్లింది. హెడ్ కానిస్టేబుల్ మెండి సత్యనారాయణ,హోమ్ గార్డు ఎన్. ఎస్.రెడ్డి అక్కడికక్కడే మృతి చెందారు. మృతులు తిమ్మాపురం పీఎస్ లో పనిచేస్తున్నారు. సమాచారం అందిన వెంటనే పోలీసులు అక్కడకు చేరుకుని మృతదేహాలను స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## అంబులెన్సులను ఆపడం అమానుషం

అమరావతి తెలంగాణలో తిరిగి గురువారం రాత్రి నుండి అంబులెన్సులను సైతం అనుమతిం చని తెలంగాణ పోలీసులు.ఆధారాలతో సహ మీరుపంపుతున్నాను.సరిహద్దుల్లో రోగుల ఆర్తనాదాలు వినండి.వారి సమస్య పరిష్కరించి ప్రాణాలు కాపాడండని బిజెపి రాష్ట్ర ప్రధానకార్యదర్శి యస్.విష్ణువర్ధన్ రెడ్డి అన్నారు. కర్నూలు బార్డర్ లో రోగులు ఆక్రందనలు చేస్తుంటే ఆంధ్ర పోలీసులు, ఇతర అధికారులు చేతులెత్తేసారని అయన విమర్శించారు. సాదారణ ప్రయాణికులను 6 గంటలనుండి తొమ్మిది గంటల వరకు అనుమతించి తెలంగాణ పోలీసులు అంబులెన్స్ లను మాత్రం వెనక్కి పంపుతున్నారు. ఇంతకంటే ఘోరం ,సిగ్గుచేటు మరొకటి లేదని అయన అన్నారు. సాధారణ ప్రజలు తెలంగాణ లోని పోలీసు కంట్రోల్ రూమ్ లో అనుమతులును తీసుకోవడం అది అంబులెన్సు ఉన్న రోగికి వారి బందువులకు సాధ్యమా అని అయన ప్రశ్నించారు. ఆంధ్ర పోలీసులు రోగులకు ఇచ్చిన ఈ పాస్ ను సైతం తెలంగాణ పోలీసులు లెక్కచేయడంలేదని అయన విమర్శించారు.

## చంద్రగిరి లో కోవిడ్ సెంటర్ ప్రారంభం

చిత్తూరు చంద్రగిరి కోవిడ్ కేర్ సెంటర్, తొండ వాడ సమీపంలో హీరా ఉ ర్దూ కళా శాలలో శుక్రవారం నుంచి అందుబా టులోకి వచ్చింది. కరోనా పేషెంట్లకు సంతృప్తి కర సేవలు అందించనున్నట్లు చెవిరెడ్డి పేర్కొన్నారు. ఇక్కడ పనిచేసే సిబ్బందికి ప్రభుత్వం అందించే వేతనం తో పాటు అదనంగా తన సొంత నిధులతో 2,500 చొప్పున చెల్లించ నున్నట్లు స్పష్టం చేశారు. కోవిడ్ సెంటర్ లో ఏర్పాట్లను ప్రభుత్వ విప్ చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి, జిల్లా కలెక్టర్ హరి నారాయణన్ తో కలిసి పరిశీలించారు. అనంతరం ఆర్డీఓ కనక నరసారెడ్డి, ఇతర అధికారులు, డాక్టర్లు, వైద్య సిబ్బందితో ప్రత్యేకంగా సమావేశమై దిశా నిర్దేశం చేశారు. జిల్లా వ్యాప్తంగా కోవిడ్ కేర్ సెంటర్ల ఏర్పాటులో జిల్లా కలెక్టర్ శక్తి వంచన లేకుండా కృషి చేస్తున్నారని ప్రభుత్వ విప్ చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి అన్నారు. కోవిడ్ బాధితులకు మెరుగైన సేవలు అందించడానికి తొండవాడ సమీపంలోని హీరా కళాశాలలో కోవిడ్ కేర్ సెంటర్ ప్రారంభించనున్నట్లు వివరించారు. ఇప్పటికే అధికారులు, సిబ్బందికి విధుల కేటాయింపు జరిగిందన్నారు. కోవిడ్ పేషెంట్ తన ఇంటిలో వున్న ఫీలింగ్ కలిగేలా ఈ విపత్కర పరిస్థితుల్లో ఆదుకోవలసిన భాధ్యత మనపై వుందని అన్నారు. ప్రజల్లో వున్న భయం పోవాలని అన్నారు. పేషెంట్ కు రాగానే వైద్య పరీక్షలతో పాటు 32 వస్తువులతో కూడిన వెల్కమ్ కిట్ అందించనున్నట్లు తెలిపారు. టిటిడి ప్రొవిజన్స్ అందిస్తుందని, మంచి ఆహారం, వైద్యం అందించేలా చర్యలు చేపట్టామని అన్నారు. ప్రతి అంశానికి ఒక అధికారి ఇంచార్జిగా నిర్దేశించినట్లు తెలిపారు. ప్రతి పేషెంట్ అందుతున్న వైద్య సేవలపై నమోదు, వారి అవసరాలు తెలుకునే విధంగా తుడాలో కాల్ సెంటర్ ఏర్పాటు చేస్తున్నామని అన్నారు. మినీ లైబ్రరీ, ఆధ్యాత్మిక పుస్తకాలు, త్రాగడానికి వేడి నీరు, యోగా, మెడిటేషన్ వంటి సౌకర్యాలు, ఇండోర్ గేమ్స్ కేరమ్స్ వంటివి కూడా అందుబాటులో పెట్టనున్నామని తెలిపారు.

## భవానీ ఛారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో 50 పీపీఈ కిట్లు పంపిణీ

రాజమహేంద్రవరం ఆదిరెడ్డి కుటుంబ సభ్యులు తమ భవానీ ఛారిటబుల్ ట్రస్టు తరపున జమాతే ఇస్లామి హింద్ అండ్ స్టూడెంట్ ఇస్లామిక్ ఆర్గనైజేషన్ రాజమండ్రి శాఖ వారికి 50 పీపీఈ కిట్లు అందచేశారు. తమ ఆదిరెడ్డి యువ సేన సభ్యులు లచ్చిరెడ్డి సురేష్ , నాగబాబు ఇతర సభ్యులతో స్టూడెంట్ ఇస్లామిక్ ఆర్గనైజేషన్ వారికి ఆ పీపీఈ కిట్లను స్థానిక మెయిన్ రోడ్డులోని జగదీశ్వరీ హోటల్ వద్ద అందచేశారు. భవిష్యత్తులో మరే సహాయ సహకారాలు కావాలన్నా తమ భవానీ ఛారిటబుల్ ట్రస్టు తరపున అందచేస్తామని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి ఆదిరెడ్డి శ్రీనివాస్ (వాసు) ఈ సందర్భంగా వారికి హామీ ఇచ్చారు. సమాజ శ్రేయస్సు కోసం ప్రాణాలొడ్డి సేవ చేస్తున్న స్టూడెంట్ ఇస్లామిక్ ఆర్గనైజేషన్ వారికి ఇతర స్వచ్ఛంద సంస్థలు కూడా సహకారం అందించాలని కోరారు. కోవిడ్ ఎమర్జెన్సీ టాక్స్ ఫోర్స్ -2021 పేరిట ఒక సెంటర్ను ఏర్పాటు చేసి ఆ సెంటర్ ద్వారా కోవిడ్ పేషంట్లకు, ప్రజలకు సేవ చేయడం అభినందనీయమన్నారు. స్టూడెంట్ ఇస్లామిక్ ఆర్గనైజేషన్ వారు ఏర్పాటు చేసిన 8121912108, 6302951707 నెంబర్లకు ఫోన్ చేసి కోవిడ్ -19 సంబంధించిన సేవలు, సలహాలు ఉ చితంగా పొందాలని సూచించారు. అలాగే హె?మ్ క్వారంటైన్ ఫుడ్ అండ్ మెడిసిన్ కోసం 9381992300, అంబులెన్స్ సర్వీస్ కోసం 824737534, డాక్టర్ కన్సల్టెన్సీ కోసం 9440836811, హాస్పిటల్ బెడ్స్ వివారల కోసం 9505782353, కరోన కారణంగా మరణించిన వారి అంత్యక్రియల కోసం 9848410260 నెంబర్లకు ఫోన్ చేసి సేవలు పొందవచ్చని సూచించారు . ప్రస్తుత ఈ విపత్కర పరిస్థితుల్లో ప్రాణాలకు తెగించి సమాజానికి సేవలందిస్తున్న స్టూడెంట్ ఇస్లామిక్ ఆర్గనైజేషన్ వారికి దాతలు సహకారం అందించాలని ఆదిరెడ్డి వాసు పిలుపునిచ్చారు.

## రాష్ట్రంలో విధ్వంసమే?అభివృద్ధి శూన్యం

విశాఖపట్నం ఏపీ సీఎం జగన్మోహన్ రెడ్డిపై తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్య క్షుడు అచ్చెన్నాయుడు తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు.విశాఖలో మీడియాతో మాట్లాడుతూ రాష్ట్రంలో కరోనా విజృంభిస్తోందని, ఇప్పటికే కరోనా మహమ్మారివల్ల 9, 10 వేల మంది చనిపోతే ముఖ్యమంత్రి ఏం చేశారని ప్రశ్నించారు. ఇంత జరిగినా సీఎం బాధ్యతారహితంగా మాట్లాడు తున్నారని, కరోనాతో సహజీవనం చేయాలని నీతిమాలిన వ్యాఖ్యలు చేస్తున్నారని మండిపడ్డారు. నిన్న వ్యవసాయశాఖ చెక్కుల పంపిణీ కార్యక్రమంలో ముఖ్యమంత్రి మాస్క్ లేకుండా కనిపించారని దుయ్యబ ట్టారు. ఈ కార్యక్రమంలో ఒక్క జగన్కు తప్ప అందరికీ మాస్క్ ఉందని అన్నారు. తమిళనాడులో సినీ పరిశ్రమకు సంబంధించినవారు ముఖ్యమంత్రి స్టాలిన్కు చెక్కు ఇవ్వడానికి వెళితే.. సీఎం మాస్క్ పెట్టుకుని బాధ్యతగా వ్యవహరించారన్నారు. స్టాలిన్ను చూసి జగన్ నేర్చుకోవాలన్నారు.

# జూనియర్ ఎన్టీఆర్ కోవిడ్ నుంచి త్వరగా కోలుకోవాలని అభిమానులు ప్రార్థనలు

### బెస్ట్ తారక్ యూత్ అభిమానులు కోవిడ్ నుంచి ప్రజలను కాపాడాలని ప్రార్థనలు

కౌతాళం ( విభారె) జూనియర్ ఎన్టీఆర్ కోవిడ్ బారిన పడిన విషయం అందరికీ తెలిసిందే. మండల పరిధిలోని బాపురం గ్రామంలో తారక్ యూత్ గ్రూపు సభ్యులందరు జూనియర్ ఎన్టీఆర్ కోవిడ్ మహమ్మారి నుంచి త్వరగా కోలుకువాలని గురువారం మరెమ్మ గుడిలో ,చర్చి లో మసీదులో ప్రార్థనలు నిర్వహించారు.కరోన సెకండ్ వే ప్రమాద స్థాయి లో ఉన్నందున గ్రామ ప్రజలు కు ముఖానికి మాస్క్ ధరించి సామాజిక దూరం పాటించి తాగు జాగ్రత్తలు తీసుకోవాలి పిలుపునిచ్చారు. అత్యవసర పరిస్థితి తప్ప ఎవరూ బయటికి రాకూడదని కాలనీ వాసులు కు పిలుపునిచ్చారు.ఎన్టీఆర్ పిలుపు మేరకు వాహనాలు నడిపేటప్పుడు కుటుంబ సభ్యులు గుర్తుకు చేసుకోవాలని, తగు జాగ్రత్తలు తీసుకోవాలి తెలిపారు. ఎన్టీఆర్ జన్మదిన వేడుకలకు తగు సామాజిక సేవలు అందిస్తామని బెస్ట్ తారక్ గ్రూపు సభ్యులు నగరాజ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో తారక్ యూత్ సభ్యులు నగరాజ్, శ్రీకాంత్, చెన్న తదితరులు అభిమానులు, కాలనీ వాసులు పాల్గొన్నారు.

# ఆర్ముగం నగర్ సచివాలయ సేవలు ఆదర్శప్రాయం

### సేవా రత్న మిత్ర పురస్కారాల ప్రధానం


నెల్లూరు ( విభారె) ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం వాలంటరీలలో సంవత్సరకాలం పాటు వారు చేసిన సేవలు పలు అభివృద్ధి పథకాల పంపిణీ నందు వారి సేవల నివేదిక ఆధారంగా వాలంటీర్లను సేవా వజ్ర రత్న మిత్ర అవార్డులతో సత్కరిం చేందుకు నిర్ణయించింది. అందులో భాగంగానే నాయుడుపేట మున్సిపాలిటీ పరిధిలోని ఆర్ముగం నగర్ సచివాలయం పరిధిలోని షేక్ హసీనా బేగం, రమణమ్మ అనే ఇద్దరు వాలంటరీలు రెండు అత్యుత్తమ సేవ రత్న అవార్డులను కైవసం చేసుకున్నారు. వారికి ధీటుగానే మిగతా వాలంటరీలు సేవా మిత్ర అవార్డులను కౌన్సిలర్లు వెంకట కృష్ణారెడ్డి పాలేటి నాగార్జున చేతుల మీదుగా అందుకున్నారు. వార్డు సెక్రటరీ చంద్రమ్మ సచివాలయ సిబ్బంది వాలంటరీల సహకారంతో ప్రజలకు మేలైన సేవలు అందిస్తూ నాయుడుపేట మున్సిపాలిటీ పరిధిలోని సచివాలయలలోనే తమ ఆర్ముగ నగర సచివాలయాన్ని మొదటి స్థానంలో నిలిపి అన్ని సచివాలయాలకు ఆదర్శప్రాయంగా నిలిచింది. పురస్కారాలు అందుకోవడం పై వాలంటీర్ల మనోభావాలను అడగ్గా తాము రెట్టింపు ఉత్సాహంతో పని చేసి జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వానికి తమ సచివాలయానికి మంచి పేరు తీసుకొస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది షేక్ హుమయోన్ భాష, రవిచంద్ర శీను తదితరులు పాల్గొన్నారు.

# బృందావనానికి గంధ లేపనం

### అక్షయ తృతీయ సందర్భంగా విశేష అలంకరణ

మంత్రాలయం( విభారె) పవిత్ర పుణ్యక్షేత్రమైన మంత్రాలయం రాఘవేంద్ర స్వామి మూల బృందావనానికి అక్షయ తృతీయ సందర్భంగా గంధ లేపనంతో విశేషంగా అలంకరించారు. పీఠాధిపతులు శ్రీ సుభుధేంద్ర తీర్థులు మూల బృందావనానికి స్వయంగా విశేష పూజలు నిర్వహించారు. ముందుగా తుంగభద్ర నది జలంతో బృందావనానికి జలాభిషేకం గావించారు. పంచామృతాభిషేకం అనంతరం గంధంతో బృందావనం ఆసాంతం లేపనం గావించారు. అనంతరం మంగళ హారతులు సమర్పిం చారు. పీఠాధిపతులు మూల రాముల పూజలను పూజా మందిరంలో నిర్వహించారు. ప్రతి సంవత్సరం ఎంతో ఆర్భాటంగా వేలాది మంది భక్తుల సమక్షంలో అక్షయ తృతీయ వేడుకలను నిర్వహించేవారు. గంధ లేపనం అలంకారంలో ఉన్న రాఘవేంద్రస్వామి బృందావనాన్ని భక్తులు దర్శించుకుని పావవనం చెందేవారు. ఈ సంవత్సరం కరోనా మూలంగా లాక్ డౌన్ విధించడంతో గుడి తలుపులు మూసి వేశారు .భక్తుల దర్శనాలనురద్దు చేయడంతో బృందావనాన్ని భక్తులు దర్శించుకో లేకపోయారు. కానీ అంతర్జాలంలో స్వామి మూల బృందావనాన్ని భక్తులు దర్శించుకోవడానికి అధికారులు అవకాశం కల్పించారు.

# తెలియకుండానే ప్రాణం తీసేస్తున్న కరోనా



కరోనా సెకండ్ వేవ్‌లో చాలా మంది బాగానే ఉన్నట్లు కనిపించినా ఉన్నట్లుండి ప్రాణాలు కోల్పోతున్నారు. ఇప్పటి వరకు కరోనా కారణంగా వయో వృద్ధులు, శ్వాస కోశ సమస్యలు ఉన్న వారు మాత్రమే కరోనా వైరస్ ప్రభావానికి ప్రాణాలు కోల్పోయేవారు. కానీ సెకండ్ వేవ్‌లో కరోనా వైరస్ అప్పటివరకూ మామూలుగానే ఉండి ఒక్కసారిగా నష్టపరుస్తోంది. దీనికి కారణం హ్యాపీ హైపోక్సియా (హ్యాజీజూజూఎ హ్యఎజూనీలీతిజీ). దీని కారణంగా స్వల్పంగా వైరస్ లక్షణాలతో అప్పటివరకు చూడటానికి ఆరోగ్యంగా, చలాకీగా ఉన్నవారూ ఒక్కసారిగా కుప్పకూలి చనిపోతున్నారు.హ్యాపీ హైపోక్సియా లక్షణం కారణంగా కరోనా రోగులతో పాటు మామూలు వ్యక్తులు కూడా అప్పుడప్పుడు తమ ఆక్సిజన్‌ను పల్స్ ఆక్సిమీటర్‌లో తనిఖీ చేయాలని నిపుణులు సూచించారు. హ్యాపీ హైపోక్సియాలో, పెదవుల రంగు మారడం ప్రారంభిస్తుంది. ఇది లేత నీలం రంగులోకి మారుతుంది. చర్మం కూడా ఎరుపు లేదా ఊదా రంగులోకి మారడం ప్రారంభిస్తుంది. వేడిలో లేకపోయినా, వ్యాయామం చేయకపోయినా చెమటలు పడతాయి. ఇవి రక్తంలో తక్కువ ఆక్సిజన్ లక్షణాలు. ఆక్సీమీటర్ ద్వారా లక్షణాల పర్యవేక్షణ అవసరమైతే వెంటనే ఆసుపత్రిలో చేరడానికి అవకాశం ఉంటుంది.కొందరిలో అప్పటికి ఆక్సిజన్ శాతం సంతృప్తికరంగానే ఉన్నప్పటికీ చూస్తుండగానే పడిపోతోంది. 72 గంటల్లో పరిస్థితి చేయిదాటిపోతోంది. కరోనా వల్ల ఇలా జరుగుతోంది. లోగడ ఆక్సిజన్ శాతం కాస్త తగ్గితే హోం ఐసొలేషన్‌లో ఉండి చికిత్స తీసుకోమనేవారు. ఇప్పుడు సీటీస్కాన్ పర్సంటేజీని బట్టి ఇంట్లో ఉండాలో, ఆసుపత్రిలో చేరాలో వైద్యులు చెబుతున్నారు. ప్రస్తుతం హ్యాపీహైపోక్సియా యువతలో ఎక్కువగా కనిపిస్తోంది. మరణాలూ వారిలో ఎక్కువ ఉంటున్నాయి.హ్యాపీ హైపోక్సియాకు రెండు ప్రధాన కారణాలున్నాయని వైద్య నిపుణులు వివరిస్తున్నారు. వైరస్ కలిగించే ఇన్‌ఫ్లమేషన్ రియాక్షన్ వల్ల ఊపిరితిత్తుల నుంచి రక్తం సరఫరా చేసే సన్నటి రక్తనాళాల్లోను గడ్డలు ఏర్పడుతున్నాయి. ఊపిరితిత్తులు దెబ్బతినడం, రక్తనాళాల్లో గడ్డలు ఏర్పడటంతో ఆక్సిజన్ శోషించుకునే గుణం తగ్గుతోంది. మెదడుకు అవసరమైనంత రక్తం సరఫరా కాదు. బృహత్ ధమనికి పైన ఉండే కరోటిడ్ బాడీస్‌ను వైరస్ దెబ్బతీయడం వల్ల రక్తంలో ఆక్సిజన్ శాతం తగ్గిందని రోగి గ్రహించలేడు.మరో కారణం.. రక్తంలో ఆక్సిజన్ శాతం తగ్గినప్పుడు దాన్ని గాలి నుంచి ఎక్కువగా గ్రహించేందుకు మనిషి అసంకల్పితంగానే ఎక్కువసార్లు ఊపిరి తీసుకుంటాడు. ఆ క్రమంలో రక్తంలో ఉండే కార్బన్ డై ఆక్సైడ్ ఎక్కువగా బయటకు వెళ్లిపోతుంది. సాధారణంగా రక్తంలో కార్బన్ డై ఆక్సైడ్ 40 మిల్లీమోల్స్ ఉండాలి. మనిషి మెదడులో శ్వాసకోశ వ్యవస్థను నియంత్రించే భాగాన్ని స్టిమ్యులేట్ చేసేది అనీ2నే. ఉండాల్సిన దానికంటే తగ్గిపోవడం వల్ల, మనిషి మెదడులో స్టిమ్యులేషన్ జరగక ఆక్సిజన్ శాతం తగ్గిన విషయాన్ని రోగి గ్రహించలేడు.హ్యాపీ హైపోక్సియా లక్షణాలు: కరోనా సోకినా జ్వరం, తలనొప్పి వంటి లక్షణాలు కనిపించకపోవచ్చు. బాధితులమన్నదే తెలియకపోవచ్చు.

# టీమిండియా చీటింగ్ చేసి సిరీస్ గెలిచింది: పైన్



సిడ్నీ: గతేడాది ఆసీసీ గడ్డపై జరిగిన బోర్డర్ గవాస్కర్ ట్రోఫీని టీమిండియా 2-1 తేడాతో గెలిచిన సంగతి తెలిసిందే. ఆసీస్‌తో సిరీస్ ముగిసి దాదాపు ఆరు నెలలు కావొస్తున్న నేపథ్యంలో ఆసీస్ టెస్టు జట్టు కెప్టెన్ టిమ్ పైన్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. టీమిండియా తమ దృష్టి మళ్లించడంతోనే సిరీస్ ఓడిపోయామంటూ విచిత్రమైన వ్యాఖ్యలు చేశాడు. ‹‹టీమిండియా మమ్మల్ని పక్కదారి(సైడ్ షోస్) పట్టించిన విధానం సూపర్‌గా ఉంది. మూడో టెస్టు ముగిసిన తర్వాత టీమిండియా మొదట గబ్బాకు వెళ్లమని చెప్పారు. దీంతో క్రికెట్ ఆస్ట్రేలియా నాలుగో టెస్టును ఎక్కడ నిర్వహించాలా అనే ఆలోచనలో పడింది. ఇంతలో ఏమైందో కానీ మళ్లీ మనసు మార్చుకొని గబ్బాలో ఆడుతామని టీమిండియానే పేర్కొంది. ఇలా మా ఏకాగ్రతను దెబ్బతీసేందుకే టీమిండియా మమ్మల్ని పక్కదారి పట్టించింది.అందుకే మ్యాచ్‌పై సరిగ్గా దృష్టి పెట్టలేక ఓడిపోయాం.. అలా ఈ విషయంలో చీటింగ్ చేసి టీమిండియా మ్యాచ్‌తో పాటు సిరీస్‌ను కూడా ఎగురేసుకుపోయింది.›› అంటూ కామెంట్లు చేశాడు. కాగా టిమ్ పైన్ వ్యవహారంపై సోషల్ మీడియాలో విపరీతమైన ట్రోల్స్ వచ్చాయి. ‹‹దొంగల పడ్డ ఆర్నెళ్లకు కుక్కలు మొరిగినట్లుందని.. సిరీస్ ముగిసిన వెంటనే ఎందుకు ఇలా అనలేదు.


# కొత్త లవర్ కు హీరోయిన్ టాటా.. పాత ప్రియుడిపైనే మోజు!




సినిమా ఇండస్ట్రీలు ఎలాంటి సినిమాలను ప్రొడ్యూస్ చేస్తాయో.. అక్కడి నటీనటుల వ్యక్తిగత జీవితాలు కూడా అదేవిధంగా ఉండడం విశేషం. హాలీవుడ్ లో బోల్డ్ కంటెంట్ ఎలా ఉంటుందో అందరికీ తెలిసిందే. పడక గది సన్నివేశాలు కూడా చాలా సింపుల్ గా తెరకెక్కుతుంటాయి. అదే మనదగ్గర బాలీవుడ్ కు వచ్చేసరికి వాటి తీవ్రత తగ్గుతుంది. ఘాటు రొమాన్స్ తో సినిమాలు రూపొందుతుంటాయి. ఇక టాలీవుడ్ వంటి ఇండస్ట్రీలకు వచ్చేసరికి రొమాన్స్ స్థాయికూడా ఇంకా తగ్గిపోతుంది.ఇక నటీనటుల వ్యక్తిగత జీవితాలు కూడా ఇండస్ట్రీని బట్టే ఉంటాయి. టాలీవుడ్ లో నటీనటుల లవ్ మ్యాటర్స్ చాలా తక్కువగానే ఉంటాయి. బ్రేకప్ లు కూడా చాలా తక్కువ. బాలీవుడ్ కు వెళ్లే సరికి పరిస్థితి మారిపోతుంది. అక్కడ లవర్ ను మెయింటెయిన్ చేయడమే స్టేటస్ గా భావిస్తుంటారు. అలా.. ప్రేమలు కామన్.. బ్రేకప్ లు కూడా కామనే. ఇదే విషయాన్ని హాలీవుడ్ కు అప్లై చేసినప్పుడు అది మరింత ఫాస్ట్. ఎవరు ఎప్పుడు ఎవరిని లవ్ చేస్తారో..? ఎన్నాళ్లు సహజీవనం చేస్తారో? ఎప్పుడు లవర్ ను స్టెఫినీ మాదిరిగా మార్చేస్తారో తెలియదు. అలాంటి కథల్లో ఒకటే ఇది.హాలీవుడ్ హీరోయిన్ జెన్నీఫర్ లోపెజ్ స్టార్ డమ్ గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు. ఇండస్ట్రీలో టాప్ స్టార్ గా ఉన్న జెన్నీ.. ప్రేమ విషయంలోనూ క్రేజీ హీరోయిన్ గా మారింది. ఆమె అలెక్స్ రోడ్రిగ్స్ తో నాలుగేళ్లుగా సహజీనం చేస్తోంది. ఇద్దరిలో ఎవరికి బోర్ కొట్టిందో తెలియదుగానీ.. బ్రేకప్ టైమ్ వచ్చేసిందని ఫిక్స్ అయిపోయినట్టు సమాచారం. అది ఇంకా అఫీషియల్ గా అనౌన్స్ చేసినట్టు కూడా లేరు. కానీ.. జెన్నీఫర్ మాత్రం.. మరో బాయ్ ఫ్రెండ్ తో షికార్లు తిరిగేస్తోంది!అతను ఎవరో కాదు.. తన పాత ప్రేమికుడే! రోడ్రిగ్స్ కన్నా ముందు బెన్ అఫ్లెక్స్ తో వ్యవహారం నడిపింది జెన్నీఫర్. వీరిద్దరూ నాలుగేళ్ల డేటింగ్ తర్వాత 2003లో పెళ్లి కూడా చేసుకున్నారు. కానీ.. ఏడాది తిరగక ముందే విడిపోయారు. ఇప్పుడు మరోసారి అతడితో కలిసి తిరుగుతోందట జెన్నీ. ఈ నెల 8న చెట్టాపట్టాలేసుకొని తిరిగిన ఫొటోలు మీడియా కంట పడడంతో.. వైరల్ అయ్యాయి.

# సర్కారు.. లో కీర్తి సురేష్ పాత్ర ఇదే?

మహేశ్ బాబు హీరోగా పరశురామ్ తెరకెక్కిస్తోన్న చిత్రం ‹సర్కారు వారి పాట›. కీర్తి సురేశ్ హీరోయిన్ గా రూపొందుతున్న ఈ చిత్రం కరోనా సమస్యలతో సెకండ్ షెడ్యూల్ తర్వాత బ్రేక్ పడింది. అయితేనేం ఈ సినిమా మీద వచ్చే వార్తలకు బ్రేక్ పడటం లేదు. అదీ సూపర్ స్టార్ స్టామినా. ఈ సినిమా కథేంటి..మహేష్ క్యారక్టర్ ఏమిటి...కీర్తి సురేష్ ఏం చేస్తుంది అంటూ రకరకాల కథలువ్యాఖ్యానాలు వినపడుతున్నాయి.ఇప్పటికే ఈ సినిమా స్టోరీ లైన్ మహేష్ క్యారెక్టర్ విషయమై రకరకాల వార్తలు పుట్టుకొచ్చాయి. ఈ క్రమంలోనే తాజాగా సర్కారు వారి పాట ఫస్టాఫ్ సెకండాఫ్లలో కీర్తి సురేష్ రోల్ ఎలా ఉంటుందనే దానిపై ఓ న్యూస్ వైరల్ అవుతోంది.అందుతున్న సమాచారం మేరకు ఈ సినిమాలో కీర్తి సురేష్ పాత్ర హైలెట్ గా నడుస్తుంది. స్క్రీన్ టైమ్ ఎక్కువే. అలాగే ఈ సినిమాలో ఆమె పాత్ర మహేష్ బాబుకు సబార్డనేట్ గా కనిపిస్తుంది అంటున్నారు. బ్యాంకు స్కాం నేపథ్యంలో ఈ సినిమా రూపొందుతోందని



సమాచారం. సోషల్ మెసేజ్తో కూడిన స్ట్రాంగ్ కథాంశంతో ఈ మూవీ బ్యాంకింగ్ వ్యవస్థలో జరుగుతున్న మోసాలు అవినీతికి సంబంధించిన సామాజిక అంశాన్ని ఇందులో చూపించనున్నట్లు తెలుస్తోంది. అలాగే ఈ సినిమాలో మహేష్ బ్యాంక్ మేనేజర్ గా కనిపిస్తాడట. అదే బ్యాంక్ లో ఉద్యోగినిగా కీర్తి సురేష్ కనిపిస్తుందిట. ఇక కామెడీకి పెద్ద పీట వేస్తూ హీరోయిన్ రోల్ కూడా గ్లామరస్గా తీర్చిదిద్దుతున్నారని టాక్.మైత్రీ మూవీ మేకర్స్ జీఎమ్బీ ఎంటర్టైన్మెంట్స్ 14 రీల్స్ ప్లస్ సంస్థలు నిర్మిస్తున్నాయి. తమన్ సంగీతం అందిస్తున్నారు. ఇప్పటికే విడుదలైన మహేశ్ ప్రీ లుక్ పోస్టర్ సినిమాపై ఆసక్తిని పెంచుతోంది. 2022 సంక్రాంతికి విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు దర్శకనిర్మాతలు.




# ఈ వారం ఓటీటీలో విడుదల అవుతున్న సినిమాలు ఇవే..!

కరోనా మహమ్మారి విజృంభనతో దాదాపు అన్ని రాష్ట్రాలు లాక్ డౌన్ ప్రకటించడంతో థియేటర్స్ మూతపడ్డాయి. దీంతో ఇళ్లకే పరిమితమైన సినీ అభిమానులకు ఇప్పుడు మళ్లీ ఓటీటీ వేదికలే దిక్కయ్యాయి. ఇప్పటికే పలు కొత్త సినిమాలని స్ట్రీమింగ్ పెట్టి వీక్షకులను అలరించడానికి ఓటీటీలు ప్రయత్నిస్తున్నాయి. ఈ క్రమంలో ఈ వారంలో నాలుగు సినిమాలు - ఒక వెబ్ సిరీస్ డిజిటల్ ఫ్లాట్ ఫార్మ్ లోకి వస్తున్నాయి.బాలీవుడ్ స్టార్ హీరో సల్మాన్ ఖాన్ నటించిన ‹రాధే› సినిమా పే ఫర్ వ్యూ విధానంలో ఈద్ సందర్భంగా మే 13న రిలీజ్ అవుతోంది. ప్రభుదేవా దర్శకత్వం వహించిన ఈ సినిమా జీ ప్లెక్స్ - డిష్ టీవీ - డీటుహెచ్ - టాటా స్కై - ఎయిర్ టెల్ డిజిటల్ టీవీల్లో విడుదల కానుంది. థియేటర్స్ లో రిలీజ్ కావాల్సిన ‹రాధే› కోవిడ్




పరిస్థితుల్లో పే-పర్-వ్యూ ప్రాతిపదికన ఎలాంటి స్పందన తెచ్చుకుంటుందో అని అందరూ ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.తెలుగు దర్శకుడు రాజ్ డీకే రూపొందించిన ‹సినిమా బండి› సినిమా మే 14న నెట్ ఫ్లిక్స్ ఓటీటీలో రిలీజ్ అవుతోంది. ఇప్పటికే విడుదలైన ట్రైలర్ - సాంగ్ తో ఇదొక డిఫరెంట్ సినిమా అని అర్థం అవుతోంది. అలానే రామ్ నారాయణన్ దర్శకత్వం వహించిన ‹బట్టల రామస్వామి బయోపిక్కు› సినిమా మే 14న డిజిటల్ వేదికపై విడుదల కానుంది. టైటిల్ తోనే అందరి దృష్టిని ఆకర్షించిన ఈ సినిమా జీ 5 ఓటీటీలో స్ట్రీమింగ్ అవుతుంది.విజయ్ సేతుపతి - రాశీఖన్నా - నివేదా పేతురాజ్ హీరోహీరోయిన్లుగా నటించిన ‹విజయ్ సేతుపతి› చిత్రాన్ని ‹ఆహా› యాప్ లో మే 14న అందుబాటులోకి రానుంది. సెన్సేషనల్ డైరెక్టర్ రామ్ గోపాల్ వర్మ రూపొందించిన ‹డి కంపెనీ› మే 15న విడుదల అవుతోంది. కొత్తగా స్టార్ట్ అవుతున్న ‹స్పార్క్› ఓటీటీలో ఈ సినిమా స్ట్రీమింగ్ కానుంది. మోస్ట్ వాంటెడ్ క్రిమినల్ దావూద్ ఇబ్రహీం జీవిత కథ ఆధారంగా ఈ చిత్రాన్ని తెరకెక్కించారు.హాలీవుడ్ సూపర్ హీరో డ్రామా ‹వండర్ ఉమెన్ 1984› అమెజాన్ ప్రైమ్ వీడియో ఓటీటీలో ఈ నెల 15న రిలీజ్ కానుంది. అలానే మిల్కీ బ్యూటీ తమన్నా నటించిన ‹నవంబర్ స్టోరీ› వెబ్ సిరీస్ మే 20న వస్తోంది. ఈ క్రైమ్ థ్రిల్లర్ సిరీస్ తెలుగు తమిళ హిందీ భాషల్లో డిస్నీ ప్లస్ హాట్ స్టార్ ఓటీటీలో స్ట్రీమింగ్ కి పెడుతున్నారు. కోవిడ్ సెకండ్ వేవ్ కారణంగా థియేటర్లు క్లోజ్ అయినప్పటికీ.. డిజిటల్ వేదికలు కావల్సినంత వినోదాన్ని అందించడానికి రెడీ అవుతున్నాయని అర్థం అవుతోంది.

# మేఘ ఆకాశ్ అదృష్టాన్ని ఏ సినిమా తేల్చేస్తుందో!

మేఘ ఆకాశ్ .. అప్పుడే విరిసిన పొన్నాగి పూవులా .. కాడమల్లెలా విచ్చుకున్న కళ్లతో అందంగా అనిపిస్తుంది. అందానికి అమాయకత్వం తోడైతే ఆ అందం ఇంకా అందంగా ఉంటుందని ఒక కవిగారు సెలవిచ్చినట్టుగా కనిపిస్తుంది. సాధారణంగా కొత్త హీరోయిన్స్ వెంటవెంటనే ఒకే హీరోతో సినిమాలు చేయరు. కానీ మేఘ ఆకాశ్ .. నితిన్ తో ‹లై› .. ‹ఛల్ మోహన్ రంగ› సినిమాలు చేసింది. దురదృష్టవశాత్తు ఈ రెండు సినిమాలు కూడా పరాజయం పాలయ్యాయి. దాంతో సహజంగానే ఈ అమ్మాయి జోరుకు బ్రేకులు పడ్డాయి.ఆ తరువాత నుంచి మేఘ ఆకాశ్ .. తమిళ సినిమాలపై ఎక్కువ ఫోకస్ చేస్తూ వెళుతోంది. ఈ నేపథ్యంలోనే మళ్లీ తెలుగు నుంచి ఆమెకి కొన్ని అవకాశాలు వెళ్లాయి. తెలుగులో ఆమె శివ కందుకూరి జోడీగా ‹మను చరిత్ర› చేసింది. అలాగే నాగ శేఖర్ దర్శకత్వంలో ‹గుర్తుందా శీతాకాలం› .. శ్రీవిష్ణు సరసన ‹రాజ రాజ చోళ› చేసింది. హసిత్ గోలి ఈ సినిమాకి దర్శకుడిగా వ్యవహరించాడు. ఈ మూడు సినిమాలను ఈ ఏడాదిలోనే ప్రేక్షకుల ముందుకు తీసుకురావాలనే ఆలోచనలో ఉన్నారు.ఇక మేఘ ఆకాశ్ ప్రధాన పాత్రధారిగా ‹డియర్ మేఘ› రూపొందడం విశేషం. ఈ సినిమాకి సుశాంత్ రెడ్డి దర్శకత్వం వహించాడు. ఈ సినిమాల్లో ‹రాజ రాజ చోర› .. ‹డియర్ మేఘ› సినిమాల పట్లనే కుర్రాళ్లు కాస్త ఆసక్తితో ఉన్నారు. ఈ రెండు సినిమాల్లో మేఘ ఎలాంటి పాత్రలను పోషించింది? ఎంతవరకూ అలరిస్తుంది? అనేది మాత్రం తెలియదు. సాధ్యమైనంత త్వరగా ఆమె స్టార్ హీరోల సినిమాల్లో ఛాన్స్ కొట్టేయాలి .. హిట్ పట్టేయాలి. అప్పుడే ఆమె కెరియర్ ఊపందుకునే అవకాశాలు ఉంటాయని అంటున్నారు. ఇప్పటికైనా పట్టుచిక్కించుకోకపోతే జారిపోవడం ఖాయమనే అభిప్రాయాలను వ్యక్తం చేస్తున్నారు.



EDITED, PRINTED,PUBLISHED AND OWNED BY **AVULA VIJAYA BHASKARA REDDY** PRINTED AT **SRI SANTOSH PRINTERS SHOP NO. 67-58/A2,OPP TAMIL NADU MERCANTILE BANK, OLD BUSTAND, KURNOOL- 518 001. ANDHRA PRADESH.**
**PUBLISHED FROM AVULA HUSSAIN REDDY COLONY,7-5-230, NANDYAL ROAD ALLAGADDA-518 543. KURNOOL DISTRICT. ANDHRA PRADESH. EDITOR : AVULA VIJAYA BHASKARA REDDY. RNI No : APTEL/2019/77190**